ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శనివారం 5, నవంబర్ 2022 | 16 పేజీలు

## రామయ్యను దర్శించుకున్న శ్రీశ్రీశ్రీ శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి



16లో...

# నకిలీ నక్సల్స్ అలజడి



**ఇల్లెందు, ప్రభాతవార్త :**
నక్సల్స్ కదిలికలు తగ్గటంతో ఇదే అదునుగా భావించిన నకిలీ నక్సలైట్లు నక్సల్స్‌మని చెప్పుకుంటూ డబ్బుకోసం బెదిరింపులు, కిడ్నాపులకు పాల్పడుతూ మూడు నెలలుగా మావోయిస్టుల పేరుతో పోన్లు చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం మావోయిస్టు అధికార ప్రతినిధి పేరుతో ఈ బెదిరింపులు చేస్తున్నారు. ఈ నకిలీ నక్సల్ ముఠా బయ్యారం ఇల్లందు మండలాలకు చెందిన నలుగురు ఒక ముఠాగా ఏర్పడి మావోయిస్టుల పేరుతో లక్షల రూపాయలు వసూళ్లుచేశారు. మాట వినని వారిని కిడ్నాప్ చేసి తాము డిమాండ్ చేసిన మేరకు ఇచ్చిన తర్వాతనే వదిలి పెట్టడం చేస్తున్నారు. మహబూబాబాద్ బయ్యారం ఖమ్మం ఇల్లందులలోని ఫెర్టిలైజర్ వ్యాపారులను మొక్కజొన్న వ్యాపారులను బస్తాలు అమ్మేవారినే ఎంచుకుని వసూళ్లు చేస్తున్నారు.

2లో...

**డబ్బుకోసం కిడ్నాప్**
**లక్షల్లో వసూళ్లు**
**ఫెర్టిలైజర్, మొక్కజొన్న వ్యాపారులపైనే గురి**
**మూడునెలలుగా కొనసాగుతున్న దందా**

## ప్రభుత్వ విప్ రేగాకు భద్రత పెంపు

- బుల్లెట్‌ప్రూఫ్ వెహికిల్, 4ప్లస్4 గన్‌మెన్లు
- ఇండ్ల వద్ద కూడా భద్రత

**మణుగూరు, ప్రభాతవార్త, నవంబర్4ః**
ప్రభుత్వవిప్, పినపాక ఎమ్మెల్యే, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుకు ప్రభుత్వం భద్రతను పెంచింది. రేగాకు బులెట్‌ప్రూఫ్ వెహికిల్‌తోపాటు 4ప్లస్4 గన్‌మెన్లను కేటాయించింది.



16లో...

## ప్రగతి నివేదికలు సిద్ధం చేయండి

- గ్రామాల రూపురేఖలు మారాయి
- ఒక్క ఏడాదిలో రూ.12 కోట్లు ఖర్చు
- మండల సమగ్రాభివృద్ధికి వెనుకాడను
- ప్రారంభోత్సవ సభల్లో మంత్రి పువ్వాడ



9లో..



## పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ నాణ్యతా ప్రమాణాల వైద్య బృందం

**చంద్రుగొండ, నవంబర్ 4 - ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జాతీయ నాణ్యత ప్రమాణాల వైద్యబృందం పరిశీలించింది. గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు జాతీయ నాణ్యత ప్రమాణాల వైద్యబృందం సభ్యులు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ భాగ్యవతిలు హాజరయ్యారు.

16లో...

## ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వసతులు

- జిల్లా కలెక్టర్ వెల్లడి
- ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్
- వివిధ విభాగాలను ప్రారంభించిన పాలనాధికారి



16లో...

**ఇల్లెందు, ప్రభాతవార్త :**
ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు కల్పించడం జరిగిందని జిల్లా పాలనాధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసూతి, కంటి, దంత వైద్య విభాగాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి నూతనంగా వైద్య ప్రత్యేక నిపుణులను నియమించడం జరిగిందన్నారు. ఆయా ప్రత్యేక వైద్య నిపుణులు ఏమైనా పరికరాలు అవసరం ఉన్నట్లైతే 20 రోజుల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# నకిలీ నక్సల్స్ అలజడి

(మొదటి పేజీ తరువాయి..)

ఇల్లందులోని ఓ పెర్టిలైజర్ వ్యాపారిని 3లక్షలు డిమాండ్ చెయ్యగా నిరాకరించడంతో ఆ వ్యాపారి కొడుకుని కిడ్నాపు చేసి 3లక్షలు ఇచ్చిన తర్వాతే వదిలిపెట్టినట్లుగా తెలిసింది. ఇదే పట్టణంలో మరికొంతమంది ఫెర్టిలైజర్ షాపు యజమానుల నుండి లక్షల రూపాలు వసూళ్లు చేశారనే ప్రచారం ఉంది. ఇతర నక్సల్స్ గ్రూపుల పేరు చెప్పి వసూళ్లు చేసి ఉంటే లీగల్‌గా ఉన్న ఆపార్టీ నాయకులను ఆశ్రయించే అవకాశం ఉండేది. కాని ఈ నకిలీలు తెలివిగా మావోయిస్టుల పేరు ఆపై జగన్ పేరుతో ఈ అక్రమ వసూళ్లకు తెర లేపారు. మూడు నెలలుగా నక్సల్స్ పేరుతో ఈ దందా కొనసాగుతున్నప్పటికి పోలీసులు గుర్తించలేక పోయ్యారు. ఇల్లందులో తమ పథకం విజయవంతం కావడంతో బయ్యారం ప్రాంతంలోని పురుగు మందుల షాపుల యజమానులకు పోన్లుచేసి తాము మోవోయిస్టులని తమ పార్టీకి చందాలు ఇవ్వాలని డిమాండ్ చెయ్యడం ప్రారంభించారు. అలాగే ఖమ్మంలోని మొక్కజొన్న వ్యాపారులకు కూడా ఇదే పద్ధతిలో పోన్లు చేసి కొంతమేరకు వసూళ్లు చేశారని తెలుస్తుంది. మరి కొందరు రేపు మాపు అంటూ కాలం వెళ్లదీయగా మహబూబాబాద్ వ్యాపారి కూడా కలుస్తాని చెబుతూ వచ్చాడు.అలానే బయ్యారం మండల కేంద్రంలోని పెర్టిలైజర్ వ్యాపారికి రెండు నెలల క్రితమే పోన్ చేసి డబ్బుల డిమాండ్ చేశారు. అయితే ఈ నకిలీ నక్సల్స్ ప్రత్యేకంగా పురుగు మందుల వ్యాపారులను మొక్కజొన్న వ్యాపారులపైననే గురిపెట్టడానికి కారణం లేకపోలేదు. ఈనకిలీ నక్సల్స్ ముఠాలో పురుగుమందుల, మొక్కజొన్న వ్యాపారం చేసేవాళ్లు కూడా ఉండటంతో ఈ వ్యాపారులనే టార్గెట్ చేశారు. ఎందుకంటే ఎవరి ఆర్థిక స్థితి ఏమిటో తెలిసి ఉండటంతో డిమాండ్ కూడా అదే పద్ధతిలో చేసి వసూళ్లకు పాల్పడ్డారు. బయ్యారం గందంపల్లిలోని పురుగుమందుల వ్యాపారులకు పోన్లుచేసి తమ పార్టీకి డబ్బులు కావాలని మావోయిస్టు జగన్‌ను మాట్లాడుతున్నానని తాము చెప్పిన చోట డబ్బు ఇచ్చివెళ్లాలని తాము చెప్పినట్లుగా చెయ్యకపోతే ప్రాణాలు తీస్తామని బెదిరించడంతో బయపడిన వ్యాపారులు తాము పెద్దమొత్తంలో ఇచ్చుకోలేమని నష్టాల్లోఉన్నామని వేడుకోగా తమకు ఎవరికి ఎంత ఆదాయం వస్తుందో తెలిసే అడుగు తున్నామని చెప్పి ప్రతి మందుల షాపుకు 50వేల నుండి లక్ష రూపాయలవరకు డిమాండ్ చేసినట్లుగా తెలిసింది. దాదాపుగా 15రోజులుగా ఈ పోన్లుచేస్తూ బెదిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు లేవు పోన్లద్వారా బెదిరింపులు రావడంతో ఈ వ్యాపారుల్లో ఒకరికి అనుమానం వచ్చి పోన్లద్వారా డబ్బులు డిమాండ్ విషయంను పోలీసులకు చెప్పడం ముందుగా పోలీసులు కూడా ఇది నిజమో అబద్ధమో అనేదాన్ని నిర్ధారణ చేసుకోవడం కోసం పోన్ స్విచ్ఆప్ చేసుకోమని బాదితుడికి సలహాఇచ్చారు దీంతో బాదితుడు ఒకరోజు మొత్తం తన పోన్‌ను స్విచ్చాప్ చేసుకున్నాడు మరల పోన్‌ను ఓపెన్ చేశాడు. మరల మావోయిస్టుల పేరుతో వ్యాపారి పోన్‌ద్వారా బెదిరించడం వెంటనే డబ్బులు తేకపోతే కుటుంబాన్ని హతమారుస్తామని బెదిరించడంతో బయపడిన వ్యాపారి అంత ఇచ్చుకోలేనని చెప్పి కొంత ఇవ్వడానికి ముందుకు వచ్చాడు. అయితే పోలీసులు ఈ నకిలీ నక్సల్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా ప్రచారం జరుతున్నప్పటికి నిర్ధారించలేదు. మొత్తానికినక్సల్స్ పేరుతో నకిలీనక్సలైట్లుగా అవతారం ఎత్తి సులువుగా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదిండం ఎంచుకున్నారు.

## ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్ ఆధారంగా పాఠాలు బోధించాలి



### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:

ఉపాధ్యాయులు అందరూ లెసన్ ప్లాన్ తయారు చేసి, దాని ఆధారంగానే పాఠాలు బోధించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. శుక్రవారం నాడు కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమంపై మండల విద్యాశాఖ అధికారులు, మండల ఎఫ్.ఎల్ఎన్ నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ మండలాల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరుపై మండల నోడల్ అధికారులను మండల విద్యాశాఖ అధికారులు అడిగి కార్యక్రమ అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల సామార్థ్యాలను మెరుగుపరిచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీని అమలు కోసం ఉపాధ్యాయులను ఎంపిక చేసి తగిన శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి. ఏ.శ్రీనివాస్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.రాధ, ప్లానింగ్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, జెండర్ కోఆర్డినేటర్ బి.జయ, మండల విద్యాశాఖ అధికారులు రామ్ కిషన్ రాజు, వెంకటేశ్వరరావు, రమాదేవి, రవీందర్, ఎఫ్.ఎల్.ఎన్ మండల నోడల్ అధికారులు రామ్‌ధన్, వేణు ఆనంద్, రవికుమార్, సాంబశివారెడ్డి, రిసోర్స్ టీచర్లు, కంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ బస్టాండ్‌కు అనేక అవస్థలు

### మహిళా మౌళిక సదుపాయాలపై నిర్లక్ష్యం
### ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళ ప్రయాణికులు
### అనేక సంవత్సరాలుగా పట్టించుకోని ఆర్టీసి అధికారులు

ప్రభాతవార్త, భీమదేవరపల్లి

ముల్కనూర్ ఆర్టీసీ బస్టాండ్ అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురై అవస్థలు పడుతుంది. ముల్కనూర్ బస్టాండ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నలబై సంవత్సరాల పైనే నిర్మితమై ఉన్నది. ఈ బస్టాండ్ అసంపూర్ణ నిర్మాణాలతో శిథిలావస్థలోకి చేరుకున్న ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై అధికారులకు పట్టింపు లేక నిర్లక్ష్యానికి గురవుతుంది. ముల్కనూర్ బస్టాండ్ ప్రాంతం నుంచి భారతదేశంలో మొట్టమొదటిసారిగా మహిళలు సమిష్టి కృషితో ముల్కనూర్ మహిళా స్వకృషి కలిగి ఉండడం ఈ ప్రాంత ప్రత్యేకత ఈ డైరీకి దాదాపుగా 180 గ్రామాల మహిళలకు సంబంధం కలిగి ఉండి మహిళా డైరీకి నిరంతరం ప్రయాణిస్తూ ఉంటారు. అంతేకాకుండా ఐసీడీఎస్ కార్యాలయ మహిళా సిబ్బంది ఉన్నత ప్రాథమిక పాఠశాల కాకుండా మండల కేంద్రంలోని మండల ప్రభుత్వ సంబంధిత కార్యాలయాలకు మహిళా ఉద్యోగస్థులువెయ్యికి పైగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని హన్మకొండ డిగ్రీ కళాశాలకు ఇంజనీరింగ్ కళాశాలకు విద్యార్థినిలు ప్రయాణిస్తూ ఈ బస్టాండ్ యందు మరుగుదొడ్లు మూసివేత నీటి సౌకర్యం లేక పట్టించుకునే నాథుడు లేక ప్రయాణికులకు అవస్థలకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతమంతా అనేక సంవత్సరాలుగా అపరిశుభ్రతతో దుర్వాసనలతో సంతరించుకొని ఉండడం ప్రత్యేకత అని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ బస్టాండ్‌లో కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడం మరుగుదొడ్లు పనిచేయకపోవడం మూసి ఉండడం అపరిశుభ్రతను కలిగి ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మహిళా ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసి అధికారులను ప్రయాణికులు వేడుకుంటున్నారు.



### జిల్లాలో ధాన్యం
# కొనుగోలు కేంద్రాలకు సర్వంసిద్ధం

### ప్రత్యేక అధికారుల నియామకం
### రైతులకోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
### జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య



ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జనగామ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 167కేంద్రాలను సిద్ధం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, విద్యుత్‌సరఫరా సౌకర్యాలు కల్పించామన్నారు. టార్పాలిన్, గన్నిసంచులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రతీసెంటర్‌కు డీఆర్‌డీఏ, డీసీఓ నుంచి సిబ్బంది అందుబాటులో ఉంటారని వారు ప్రతీరోజు కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు. వ్యవసాయ అధికారులు వరిధాన్యం కొనుగోలు విషయంలో మాయిశ్చర్ చూసి రైతులకు టోకెన్లు ఇవ్వాలన్నారు. నాణ్యత ప్రమాణాలు, రవాణా, తదితర అంశాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేయుటకు వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. రవాణా చేయుక్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులు పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో టోల్‌ఫ్రీ నంబర్ 6303928718కు కాల్ చేయాలని ఇరవైనాలుగు గంటలూ మూడు విడుతల వారిగా సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, రెవెన్యూ డివిజన్ అధికారులు మధుమోహన్, క్రిష్ణవేణి, డీఆర్‌డీవో జి.రాంరెడ్డి, డీసీవో కిరణ్‌కుమార్, డీసీఎస్‌వో రోజారాణి, డీఎం సంధ్యారాణి, జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కాజిపేట అభివృద్ధికి నిరంతరం కృషి

### ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ముఖాముఖి కార్యక్రమం
### ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:

ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను విని పరిష్కరించేందుకు గత కొన్ని రోజులుగా ముఖాముఖి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం కాజిపేటలోని కూరగాయల మార్కెట్ వద్ద మున్సిపల్ కమీషనర్ ప్రావీణ్య, కార్పొరేటర్లు అన్ని విభాగాల అధికారులతో కలిసి 47, 48, 67, 62, 63 డివిజన్ల ప్రజలతో ముఖాముఖిని నిర్వహించి వారి నుండి 35 ఫిర్యాదులను స్వీకరించి ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చీఫ్ విప్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరానికి ముఖ ద్వారమైన కాజిపేట ప్రాంత అభివృద్ధికి నిరంతరం తాను కృషి చేస్తున్నానన్నారు. అభివృద్ధి అనేది నిరంతరం ప్రకియ కాబట్టి పలు దశలుగా ఈప్రాంత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం విద్య, ఆధ్యాత్మిక, వ్యాపార కేంద్రంగా వర్ధిల్లుతుందన్నారు. అన్ని మతాలు, ప్రజల బాయ్ బాయ్ సిద్ధాంతంతో స్నేహపూర్వకంగా మెలగడం కాజిపేట్ ప్రత్యేకత అని అన్నారు. గత కొన్ని రోజులుగా జాతీయ రహదారిపై కొంత మంది కూరగాయాలు అమ్మడం వలన ట్రాఫిక్ జామ్ ప్రమాదాలు జరుపుతుండడమే కాకుండా కూరగాయల మార్కెట్ వ్యాపారాలు తమకు నష్టం జరుగుతందని గతంలో చీఫ్‌విప్‌కు తమ ఫిర్యాదును అందియ్యడంతో నేడు ముఖాముఖి కార్యక్రమంలో ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అల్లాగే ప్రజల నుండి మున్సిపల్ సంబంధిత, విద్యుత్, రోడ్లు, ఆరోగ్యపర, పింఛన్లు, మిషన్‌భగీరథ, స్మశాన, వాటికలు, ఇలా పలు సమస్యలను తమ దృష్టికి తీసుకుఆవడం జరిగిందని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఎలకంటి రాములు, విజయ, శ్రీరాజలి, మాజీ కార్పొరేటర్ అబూ బకర్, రైతు సమన్వయ జిల్లా కోఆర్డినేటర్ సుంచు కృష్ణ, తెరాస నాయకులు సుంచు అశోక్, డివిజన్ అధ్యక్షులు రంజిత్, కోటిలింగం, పాలడుగుల శివ, అధికారులు పాల్గొన్నారు.



# సర్పంచ్ నవీన్‌కు మాతృవియోగం

*నేలకొండపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త:*
నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్ మాతృవియోగంకు గురైనారు. రాయపూడి నవీన్ మాతృమూర్తి రాయపూడి అన్నపూర్ణ (57) శుక్రవారం ఉదయం మృతి చెందారు. మృతురాలు రాయపూడి అన్నపూర్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతురాలు అన్నపూర్ణకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మృతి సమాచారం తెల్సిన వెంటనే శాసనసభ్యుడు కందాళ ఉపేందరరెడ్డి, నేలకొండపల్లి మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, జెడ్పీ వైస్‌చైర్మన్ మరికంటి ధనలక్ష్మీ, ఎంపిపి వజ్జా రమ్య, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నంబూరి శాంత, సిడిసి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాదు, పైనంపల్లి పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ ఎండి వాజిద్, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షుడు వంగవేటి నాగేశ్వరరావు, కార్యదర్శి గొలుసు రవి, మండల టిఆర్ఎస్ నాయకులు వజ్జా శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ,





మరికంటి రేణుబాబు మృతురాలు రాయపూడి అన్నపూర్ణ మృతదేహంను సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే, మృతురాలు రాయపూడి అన్నపూర్ణ మృతదేహంను డిసిసి అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాదు, జిల్లా కాంగ్రేస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, ఎండి జావిద్, మద్ది శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రేస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎంపిటిసి మెంబర్ బొడ్డు బొందయ్య, కొరట్లగూడెం ఎంపిటిసి మెంబర్ రేగూరి వాసవి, కాంగ్రేస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గం కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, మండల కాంగ్రేస్ నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, కట్టెకోల నాగేశ్వరరావు, గుడిబోయిన వెంకటేశ్వర్లు, మక్తాల రామకృష్ణ, స్దానిక గ్రామ పంచాయతీ వైస్‌సర్పంచ్ లక్కం ఏడుకొండలు, పలువురు వార్డు మెంబర్‌లు మృతురాలు అన్నపూర్ణ మృతదేహంను సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అంతేకాక, మండల బిజేపి అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, బిజేపి మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎస్‌కే.షరీపుద్దీన్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తా రమేష్, కార్యదర్శి అప్పన ధనుంజయరావు, మండల సిపిఎం కార్యదర్శి కేవి రామిరెడ్డి, సిపిఎం నాయకులు ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, మందడపు మురళీకృష్ణ, పగిడికత్తుల నాగేశ్వరరావు, పలువురు గ్రామ ప్రముఖులు, వ్యాపారస్తులు మృతురాలు రాయపూడి అన్నపూర్ణ మృతదేహంను సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ప్రైవేట్ పాఠశాల బస్సు . మహిళ మృతి

## పిహెచ్‌సిలో సిబ్బంది కొరత వల్లనే మృతి చెందిందని బంధువుల ఆరోపణ

*దమ్మపేట రూరల్ ప్రభాతవార్త :*
ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డీ కొట్టిన ఘటనలో గర్భిణీ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిదిలోని మల్కారం సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మల్కారం లో పాఠశాల విద్యార్దులను ఇళ్ళ వద్ద దింపి తిరిగి పెద్దగొల్లగూడెం రోడ్డుపై వెళుతున్న పాఠశాల బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహన దారుడు బత్తుల వెంకటేశ్వరరావు (సుబ్బు) తన భార్య రష్మి లను డీ కొట్టింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు సమీపంలో ఉన్న చాంద్రాయపాలెం గ్రామానికి



చెందిన సుబ్బు , లచ్చాపురం గ్రామంలోని తాళ్ళ పేరయ్య ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. క్షతగాత్రుడు సుబ్బుకు కుడికాలు పూర్తిగా విరిగిపోయింది. కాగా స్థానికులు ,జిల్లా యంఆర్‌పియస్ కార్యదర్శి తిరువీదుల జేమ్స్ 108 కి సమాచారం ఇవ్వగా స్థానికుల సహకారంతో దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి క్షతగాత్రులను తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం సుబ్బును జిల్లా వైద్యశాలకు తరలించారు.

**పిహెచ్‌సిలో సిబ్బంది నిర్లక్ష్యమే**



**కారణమంటున్న బంధువులు :**
ఆరునెలల గర్భిణీకి ప్రమాదం సంభవించగానే 108 ద్వారా స్థానిక పిహెచ్‌సికి తరలించగా , అక్కడ సరైన వైద్యసదుపాయం లేనందునే మృతి చెందినట్లు మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. 108 ఆక్సిజన్ అందిస్తూ వైద్యశాల వరకు క్షతగాత్రులను తరలించినప్పటికీ సిబ్బంది అందుబాటులో లేనందునే మృతి చెందినదని, వైద్యశాల కు తాళాలు వేస్తామని బంధువులు ఆందోళన చేపట్టారు.

# మృత్యు రూపంలో బాలుడిని కబళించిన స్కూలు వ్యాన్





## -స్కూల్ వ్యాన్ ఢీకొని బాలుడు మృతి

*బూర్గంపహాడ్ ప్రభాతవార్త:*
ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపురం గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ వ్యాన్ విద్యార్థులను స్కూల్ నుండి ఎక్కించుకొని విద్యార్థుల ఇంటి వద్ద దించుతున్న క్రమంలో పాశం వెంకట్రామిరెడ్డి, రుచిత దంపతుల చిన్న కుమారుడు పాశం షణ్ముఖ(5) అనే విద్యార్థి వ్యాన్ దిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వ్యాన్ కిందపడి విద్యార్థిపై ఎక్కటంతో అక్కడికక్కడే ఆ బాలుగు మరణించాడని తెలిపారు. వ్యాన్ డ్రైవర్ చూసుకోక పోవడం తప్పిదం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. కళ్ళముందే కన్న కొడుకు ప్రాణాలు వదలడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వాళ్ల వేదన వర్ణనాతీతంగా మారింది. లక్ష్మీపురం గ్రామంలో ఈ సంఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేరాలు-దారుణాలు



## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



*టేకులపల్లి (ఇల్లెందు), ప్రభాతవార్త :*
గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన టేకులపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం గోల్యాతండా పంచాయతీ బి.కాలనీతండాకు చెందిన ఊకె వెంకటమ్మ గురువారం రాత్రి గోల్యాతండా సమీంలో కాలి నడకన బేతంపూడి గ్రామం వైపు వెళ్తుండగా, వెనుకాల నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో అల్లాడుతున్న వెంకటమ్మ విషయం తెలుసుకున్న టేకులపల్లి ఎస్సై భుక్యా శ్రీనివాస్ వెంటనే కొత్తగూడెం ప్రభత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆమె మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆమెకు ఎవరూ లేకపోవడంతో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. స్థానిక సర్పంచి బోడ నిరోషా మంగీలాల్ విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేయించారు. సర్పంచి భర్త మంగీలాల్, ఎస్ఐ శ్రీనివాస్‌లు మృతురాలికి శవపరీక్ష చేయించి దహన సంస్కారాలను పంచాయతీ ఆధ్వర్యంలో చేయించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



*అశ్వారావుపేట రూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త:*
రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన సంఘటన శుక్రవారం స్థానిక అచ్యుతాపురం క్రాస్‌రోడ్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మొద్దులగూడెంకు చెందిన కుంజా వెంకటేష్(36), కోర్స శేఖర్‌లు ద్విచక్రవాహనంపై మర్రిగూడెం వెళ్ళి తిరిగి వస్తుండగా అచ్యుతాపురం క్రాస్‌రోడ్ వద్ద కారు అదుపుతప్పి వీరిని ఢీ కొట్టి చెట్టును ఢీ కొని ఆగింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మరణించగా శేఖర్‌కు గాయాలు అయ్యాయి. అదే విదంగా కారు చెట్టును ఢీ కొనగా అందులో రామారావు అనే వ్యక్తికి గాయాలు అయ్యాయి. కాగా



క్షతగాత్రులను హుటాహుటీన చిట్టితల్లి అంబులెన్స్ ద్వారా పేట వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం తరలించారు.

## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

*దమ్మపేట, నవంబర్ 4 ప్రభాతవార్త:*
ఉరి వేసుకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పార్కెలగండి గ్రామానికి చెందిన కల్తీ సూర్యం(58) తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
కుటుంభీకులు గమనించే పాటికి అతను మరణించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. కాగా ఎస్ఐ శ్రావణ్‌కుమార్ మృతుడి తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఐటీయూసీ ఆవిర్బావ దినోత్సవం

**ములకలపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** భారత కార్మిక వర్గ శ్రేయస్సు కోసం ఏఐటీయూసీ కార్మిక సంఘము 1920 అక్టోబర్ 31న ఆవిర్భావం చెంది 103ఏళ్ళు కల్గిన ఏకైక ఘనమైన పోరాటాల చరిత్ర ఏఐటీయూసీ దక్కిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్ అన్నారు. ములకలపల్లి, రాజుపేట, పూసుగూడెం, జగన్నాధపురంలో జరిగిన వేడుకల్లో జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ...కార్మికవర్గ అభివృద్ధి కోసం అనేక చట్టాలు 44 లేబర్ కోడ్‌లు సాధించి, కార్మిక ఉద్యోగ కుటుంబాల్లో వెలుగులు నింపిన చరిత్ర ఏఐటీయూసీకి ఉందని లాలలజపతిరాయ్, జవహార్‌లాల్ నెహ్రూ, వీవీ గిరి, ఇంద్రజిత్ గుప్త లాంటి ఉద్దంతులు ఏఐటీయూసీకి నాయకులుగా ఉన్నారని అన్నారు. పోరాటాల ద్వారా పరిశ్రమలు, బ్యాంక్స్ , జాతీయ కరణ చెయ్యగా 70ఏళ్ళు కాపాడిన ప్రభుత్వరంగ సంస్థలు మొత్తం మోడీ ప్రభుత్వం ప్రైవేట్ పెట్టుబడి దారులకు అమ్మకాలు చేస్తున్నరని విమర్శలు చేశారు.




# సమస్యల వలయంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రి

**-సమస్యలను పరిష్కరించాల్సిందిగా సూపరింటెండెంట్‌కు ఐద్వా వినతి**



భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :

ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని సమస్యలపై సర్వే నిర్వహించారు. ఆంధ్ర, ఒడిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అతిపెద్ద ఆసుపత్రి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి అయినప్పటికి అందులో 73 మంది వైద్యులు కానీ, ప్రస్తుతం 19 మంది డాక్టర్స్ మాత్రమే ఉన్నారు. అతిపెద్ద ఆసుపత్రి అయిన వైద్యులు మాత్రం 19 మంది మాత్రమే ఉండడం దురదృష్టకరమని, మారుమూల ప్రాంతాల నుండిప్రజలు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వస్తారు కానీ డాక్టర్ల కొరత ఉండడంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని అన్నారు. ముఖ్యంగా గైనకాలజీ లేడీ వైద్యులు లేరని, గర్భిణీ స్త్రీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో గర్భిణీ స్త్రీలకు నొప్పులు వస్తే ఏరియా ఆసుపత్రికి వెళితే అక్కడ ఉన్నటువంటి సిబ్బంది కొత్తగూడెం వెళ్ళండి లేదా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళమని చెప్పున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడం వల్లే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వస్తారని, ఇవే కాదు డెలివరీ వార్డు దగ్గర కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని, అలాగే ఫ్యాన్లు కూడా లేవని, ఒక మంచినీళ్ళు వాటర్ బాటిల్ అన్నారు. అంతేకాకుండా గవర్నమెంట్ హాస్పిటల్‌లో స్కానింగ్ మిషన్ ఉంది కానీ దానికి సంబంధించిన వైద్యులు లేక రోగులు బయటకు వెళ్ళి స్కానింగ్ చేసుకునే పరిస్థితి నెలకొందని, ప్రజలు బయటకు వెళ్ళి స్కానింగ్ చేయించుకోవాలంటే దానికి సంబంధించి రూ.1000 నుండి అంతకు మించి అవుతుందని, అర్ధరాత్రి స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తే అక్కడ ప్రైవేటు వైద్యులు కూడా లేకపోతే ఆ పేషెంట్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే స్కానింగ్ సంబంధించిన డాక్టర్స్‌ని ఏర్పాటు చేయాలని సర్వేలో అక్కడ ప్రజలు, రోగులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ సమస్యలన్ని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా.రామకృష్ణ హాస్పిటల్‌లో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని, ఈ రోజే ఇద్దరు మహిళా వైద్యులను నియమించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టౌన్ ఆఫీస్ బేరర్స్ జీవన్‌జ్యోతి, సీ.హెచ్.రమణ, జీ.రాధా, టౌన్ కమిటీ సభ్యులు కే.రమణ, ఎస్కె చోటమ్మ, ఎం.నూక రత్నం, మంగతాయారు, జానకమ్మ, కే.సుశీల, పీ.జయ, తదితరులు ఈ సర్వేలో పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించిన ఎంపీవో ముత్యాలరావు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో డంపింగ్‌యార్డ్‌ల నిర్వహణ పనితీరును దుమ్ముగూడెం ఎంపీవో ముత్యాలరావు శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని సుమారు 24 గ్రామపంచాయతీలను శుక్రవారం సందర్శించి డంపింగ్‌యార్డ్‌ల నిర్వహణను, సర్పంచ్, కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ .. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయు విధానాన్ని వర్మికంపోస్టు తయారు విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భద్రాచలం, ప్రభాతవార్త :

భద్రాచలం పట్టణం, బూర్గంపహాడ్ మండలం సారపాకలోని విద్యుత్ 132 కేవీలో మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు చెందిన చిటూరి శివాజీ లక్షరూపాయల విరాళాన్ని దేవస్థాన అధికారులకు అందజేశారు. శుక్రవారం శ్రీస్వామి వారి దర్శనార్థమై విచ్చేసిన వీరు దర్శనం అనంతరం ఈ విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వేదపండితులు దేవస్థాన ప్రాంగణంలోని అనుబంధ ఆలయమైన శ్రీలక్ష్మీతాయారమ్మవారి సన్నిధిలో తీర్థప్రసాద వితరణ గావించారు.

# పాఠశాల విద్యార్థులకు ఇన్‌ఫోసిస్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం మండల పరిధిలోని బండారుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఇన్‌ఫోసిస్ సహాయ సహకారాలతో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ చొరవతో జిల్లాలోని వరద ముంపుకు గురైన ఏడు మండలాల్లో 30 పాఠశాలలను ఎంపిక చేసి ఇన్‌ఫోసిస్ సహకారంతో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. అందులో భాగంగా దుమ్ముగూడెం మండలంలో ఉన్న బండారుగూడెం ప్రాథమికోన్నత పాఠశాల రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛవిద్యాలయ పురస్కార్ సాధించిన సందర్భంగా ఈ పాఠశాలలను ఎంపిక చేసి కిట్లను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. ఇన్‌ఫోసిస్ అందించిన కిట్లలో నోట్‌పుస్తకాలు, పెన్సిల్ బాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, నాప్‌కిన్స్, డ్రాయింగ్ బుక్స్, వాటర్ బాటిల్‌తో పాటు జ్యామెంట్రీ బాక్స్‌తో కలిగి కిట్లను గురువారం ప్రధానోపాధ్యాయులు చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి స్వచ్ఛంద సంస్థలు, అంతర్జాతీయ పేరు పొందిన ఇన్‌ఫోసిస్ ప్రతినిధులు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు ఈ కిట్‌లను అందించడం సంతోషించదగ్గ విషయమని వారు అన్నారు. ఇన్‌ఫోసిస్ (ఎన్‌జీవో) అబ్దుల్‌ఖాదర్ తదితరులు ఈ కిట్లను పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీ.వంశీమోహన్, ఎం.సరోజిని, జీ.రవి, ఆయా తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పోకిరీల పంతం పడతాం

**-జూనియర్ కళాశాలలో షీ టీం ఎస్సై రమాదేవీ విద్యార్థినిలకు అవగాహన సదస్సు**



బూర్గంపహాడ్, ప్రభాతవార్త :

బూర్గంపహాడ్ పరిధిలోని ఎస్‌జేపీబీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా షీ టీం ఎస్సై రమాదేవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంఆ ఎస్సై రమాదేవీ మాట్లాడుతూ .. పాఠశాల, కళాశాల, బస్టాప్, గ్రామాల్లో, పలు ప్రదేశాల్లో ఇతర ప్రాంతాలలో ఎవరైనా ఆకతాయిలు అమ్మాయిలను వేధిస్తూ కనిపిస్తే వెంటనే షీ టీంపోలీసు హెల్ప్‌లైన్ నెంబర్ 7901145721కు లేదా డయల్ 100కు కాల్ చేయాలని, కొందరు విద్యార్థిని, విద్యార్థులు తప్పుడు దోవలో అడుగులు వేస్తున్నారని, మీ జీవితాలు మీరే నాశనం చేసుకుంటున్నారని, అలా మా దృష్టి వస్తే చట్టపరమైన చర్యలకు మీరే బాధ్యులు అవుతారని అన్నారు. అబ్బాయిలకు దూరంగా ఉండడం మంచిదని, స్నేహితులను, బంధువును సైతం నమ్మి ఎవరితో ఫోటోలు దిగవద్దని, మీ చిత్రాలను ఎవరితో పంచుకోవద్దని, అలా ఫోటోలు దిగిన కొందరు కామాంధులు వాటిని వేరే రూపంలో దిద్ది బ్లాక్ మెయిల్ చేసి మిమ్మల్ని లొంగదీసుకుంటారని, విద్యార్థులకు షీ టీం ఎస్సై వివరించారు. అనంతరం అదనపు ఎస్సై రమణారెడ్డి మాట్లాడుతూ .. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లు వాడుతూ చెడిపోతున్నారని, విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని, ఫోన్‌లో సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా ఎందరో విద్యార్థులు జీవితాలు ఆగం అయ్యి రోడ్డున పడ్డాయని, ఫోన్‌ల వల్ల జరిగే హానిని విద్యార్థులకు వివరించారు. కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో, బస్ ప్యాలెస్ చుట్టుపక్కల అమ్మాయిల వెంట పడే ఆకతాయిలు పోకిరీల వామనాలు నెంబర్లను గమనించాలని, వీలైతే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని, లేదా ఎవరికి భయపడకుండా నేరుగా పోలీసు స్టేషన్‌కి వచ్చి తమ సమస్యలు తెలపాలని అన్నారు. ఇప్పటికే కొంతవరకు ఆకతాయిలు ఆటలు సాగకుండా ప్రత్యేక నిఘా పెట్టి కౌన్సిలింగ్‌లు ఇస్తున్నామని, కొద్ది రోజుల్లోనే మిగిలిన పోకిరీల పంతం పడతా అని దీనికి ముందుగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు సహకరించాలని, విద్యాపై కేసులు నమోదు చేసేటప్పుడు మాకు బాధ కలుగుతుందని, కానీ చట్ట ప్రకారం తప్పదని, కావున విద్యార్థులు సక్రమంగా నడుచుకోవాలని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య, ప్రిన్సిపల్ చీన్యా, కళాశాల సీనియర్ తెలుగు అధ్యాపకులు సీ.హెచ్.నాగేశ్వరరావు, అధ్యాపకబృందం ఎన్ఎస్ఎస్ పీవో జీ.శ్రీనివాస్, ఎన్.ఎస్.కుమార్, సుమన్‌కుమార్, డీ.శ్రీనివాస్, ముకుందం, సాహితి, నరేష్, శివ, జరీనా, శ్రీను, రేష్మా, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కామేపల్లి అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం ప్రారంభం





కామేపల్లి, నవంబర్ 4 (ప్రభాతవార్త): కామేపల్లి అయ్యప్ప భక్తమండలి ఆధ్వర్యంలో 41రోజుల పాటు నిర్వహించనున్న నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. స్దానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అయ్యప్ప ప్రత్యేక షెడ్, పీఠం వద్ద ప్రత్యేక పూజలు సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్దలతో నిర్వహించిన అనంతరం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కామేపల్లి అయ్యప్ప భక్తమండలి డిసెంబర్ 14వ,తేదీ వరకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనునది. అయ్యప్ప ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌గుప్తా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గౌరవాధ్యక్షులు కొప్పూరి భాస్కర్‌రావు, స్దానిక సర్పంచ్ అజ్మీర రాందాస్‌నాయక్, ఉప సర్పంచ్ అజ్మీర్ అర్జున్, గ్రామ పెద్దలు అంతోటి అచ్చయ్యలు కార్యక్రమం లో పాల్గొని ప్రసంగించారు. అయ్యప్ప మాలధా రుల సౌకర్యార్దం భక్త మండలి ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమంను ప్రారంభించడం హర్షనీయమన్నారు. దీక్షపరులు నిత్యాన్నదానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండటం ప్రతి ఒక్కరికి ఎంతైనా అవసరమన్నారు. ఆధ్యాత్మికతను అలవర్చుకొని ముందుకు సాగాలని కోరారు. ఆధ్యాత్మిక జీవనం అభివృద్దికి తొలిమెట్టని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తమండలి సభ్యులు, దీక్షపరులు, గ్రామ పెద్దలు భూక్యా లాలు, మహంకాళి రామనర్సింహం, నాగబండి హన్మంతరావు, భూక్యా హేమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికడదాం... బాలల సంరక్షణకు పాటుపడదాం...





కామేపల్లి, నవంబర్ 4 (ప్రభాతవార్త): బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ అజ్మీర రాందాస్‌నాయక్, పంచాయితీ కార్యదర్శి పెండ్ర అనిల్‌కుమార్, పంచాయితీ కో ఆప్షన్ మెంబర్ అంతోటి అచ్చయ్య, బాలల సంరక్షణ విభాగం రిచ్ వర్కర్ లాల్‌బి, గ్రామీణ వైద్యులు దొంతు ఉపేందర్, పంచాయితీ పాలకవర్గ సభ్యులు రాయల లక్ష్మయ్య, ప్రముఖ సామాజికవేత్త చిలుముల రమేష్ శుక్రవారం పిలుపునిచ్చారు. కామేపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో బాలల సంరక్షణ సేవలపై గ్రామస్దాయి బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్దుల సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఖమ్మం ఆధ్వర్యంలో సర్పంచ్ రాందాస్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను పరిరక్షించటం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ అమిరిబోయిన తిరుపయ్య, ఉపాధ్యాయుడు కృష్ణనాయక్, అంగన్వాడీ టీచర్లు పిడమర్తి ఉపేంద్రమ్మ, వై. జ్ఞానమ్మ, డి. వసంత, ఎస్. సత్యవతి, ఏ. నిర్మల, ఆశా కార్యకర్తలు రేఖ, రాంబాబు, వీఆర్‌ఏ కన్నమాల శ్రీనివాస్, పంచాయితీ సిబ్బంది శీలపాక శేషయ్య, కాళంగి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిప్పర్ ఢీకొని రేషన్ డీలర్ మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, రాజకీయ ప్రముఖులు - ఏరియా ఆసుపత్రిలో మిన్నంటిన రోదన



మహబూబాబాద్, (ప్రభాతవార్త): గత కొన్ని సంవత్సరాలుగా సివిల్ సప్లైలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో రేషన్‌డీలర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇందిరాకాలనీకి చెందిన మార్నేని దామోదర్ (60) శుక్రవారం ఉదయం ఇంటి నుండి బయలుదేరి నెహ్రూసెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ పడడంతో ద్విచక్రవాహనంపై వస్తూ ఆగిపోయారు. ఈ క్రమంలోనే తహశీల్దార్ కార్యాలయం నుండి అతివేగంతో వస్తున్న టిప్పర్ సిగ్నల్ వద్ద ఆగి ఉన్న మృతుడు దామోదర్‌ను ఢీకొనగా టిప్పర్ ముందుభాగంలోని టైరు క్రింద ద్విచక్రవాహనంతో పాటు దామోదర్ పడడంతో అతని చేయి పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న ట్రాఫిక్ ఎస్సై, స్థానికులు వెంటనే టిప్పర్ టైరు క్రింద వద్ద దామోదర్‌ను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ కొద్ది క్షణంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, గాయత్రి గ్రానైట్స్ జనరల్ మేనేజర్ శేరి ఈశ్వర్‌ప్రసాద్, ఇతర రాజకీయ పార్టీల నాయకులు, సివిల్ సప్లై అధికారులు, రేషన్ డీలర్లు, బంధుమిత్రులు ఆసుపత్రికి చేరుకొని మృతునికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అయితే మృతుడు మార్నేని దామోదర్ గత కొన్ని సంవత్సరాలుగా రేషన్ డీలర్‌గా పనిచేస్తూ ఈ ప్రాంత నిరుపేదలకు తన వంతు సహాయం అందించేవారని, సమయానికి డబ్బులు లేకున్నా రేషన్ బియ్యాన్ని ఇచ్చేవారని, అతని ద్వారా సహాయం పొందిన స్థానికులు కంటతడి పెడుతూ బోరున విలపించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎటు చూసినా అతనిపై మమకారం, ప్రేమ అనురాగాలు ఉన్న ప్రజలంతా పెద్ద సంఖ్యలో చేరుకొని మృతుని చివరిచూపు చూసి రోదించారు. ఈ సంఘటనపై పట్టణ సిఐ సతీష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్‌ను ఢీకొన్న టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకొన్నారు. మృతుడు దామోదర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును కాపాడుకుందాం

### - పిడిఎస్‌యు జిల్లా కన్వీనర్ బానోత్ దేవేందర్




మహబూబాబాద్, నవంబర్ 04, (ప్రభాతవార్త): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ సంతలో సరుకు లాగా విద్యావ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని దీంతో పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడుకోవల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిడిఎస్‌యు జిల్లా కన్వీనర్ బానోత్ దేవేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య స్మారక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో దుస్తులు పంపిణీ చేయాలని, విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, వసతి గృహాలను ఏర్పాటుచేసి భవనాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, నవీన్, మహేష్, ప్రకాశ్, అఖిల్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు దుప్పట్లు వితరణ



మధిర టౌన్, నవంబర్ 4, (ప్రభాతవార్త): మధిర పరిధిలోని ఖాజీపురం పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ విద్యార్థులకు కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు ఉప సర్పంచ్, మండల మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆయేషా సుల్తానా, ఎస్‌టీఎఫ్ మండల అధ్యక్షులు కమల్ దంపతులు హాస్టల్ విద్యార్థులందరికి శుక్రవారం కళాశాల ఆవరణలో దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎండీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో ప్రభాకర్‌లు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన అతిథులందరూ విద్యార్థులు మంచిగా చదువుకొని, తల్లిదండ్రులకు, కళాశాలకు, సిబ్బందికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫర్హానా బేగం, వార్డు మెంబర్ షాహిద్, సెక్రటరీ ఖాజా, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు రోడ్ షోకు తరలివెళ్ళిన టీడీపీ శ్రేణులు



మధిర టౌన్, నవంబర్ 4, (ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రోడ్ షోకి శుక్రవారం టీడీపీ శ్రేణులు తరలివెళ్ళారు. చంద్రబాబునాయుడు తలపెట్టిన నందిగామ, జగ్గయ్యపేట, బాదుడే బాదుడు కార్యక్రమం రోడ్ షోకి మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి తెలంగాణ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు డా॥ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు.

## నేరాలు నియంత్రణకు సీసీ కెమెరాలు తప్పనిసరి



మధిర టౌన్, నవంబర్ 4, (ప్రభాతవార్త): నేటి సమాజంలో జరుగుతున్న నేరాల నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరని అని మధిర సీఐ మురళి శుక్రవారం పేర్కొన్నారు. స్దానిక ఆర్వీ కాంప్లెక్స్ వద్ద వ్యాపారస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళి అవశ్యకత ఎంతో ఉందన్నారు. నేర నియంత్రణ గాని నేరాలు నిరోధించడానికి ఇవి చాలా భాగా ఉపయోగపడతాయని, ప్రతి ఒక్క వ్యాపారస్తులు తమ షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ పోటీలకు విద్యార్థులకు సంసిద్ధులు చేయండి : డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 4- ప్రభాతవార్త: విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి శాస్త్రీయ అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ కోరారు. శుక్రవారం స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేవలం తరగతి గది బోధనకే పరిమితం కారాదని, శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని కోరారు.



నవంబర్ మూడో వారం నుంచి జిల్లా సైన్స్ ఫెయిర్, బాలల సైన్స్ కాంగ్రెస్, స్కూల్ ఇన్నోవేషన్ కార్యక్రమాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో చలపతిరాజు, ఎన్‌సీఎస్‌సీ సంపత్ కుమార్, నాగరాజ శేఖర్‌లు పాల్గొన్నారు.




## పేదల ఇండ్లు కూల్చివేసి నిర్వాసితులను చేయొద్దు

చుంచుపల్లి, నవంబర్ 4 - ప్రభాతవార్త:



ప్రాజెక్టులు, హైవేలు, ఇతర నిర్మాణాల పేరుతో పేదల ఇండ్లు కూల్చివేసి నిర్వాసితులుగా మార్చొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మండలంలోని రుద్రంపూర్ ఏరియా ఎస్‌ఆర్‌టీ కాలనీ నిర్వాసిత ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. సింగరేణి యాజమాన్యం, రైల్వేశాఖలు హైవే రోడ్ అథారిటీ శాఖలు తమ నిర్మాణాల కోసం పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తూ ఆక్రమించుకొని రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. చట్టపరంగా రావాల్సి న ఆర్‌ఆర్ ప్యాకేజీలు, ప్రత్యామ్నాయ నివాసాలు ఏర్పాటుపై కనీస బాధ్యత వహించకుండా నిరంకుశంగా వ్యవహరించడం సరికాదన్నారు. సాబీర్‌ఫాషా, బందెల నర్స య్య, వీరస్వామి, మల్లికార్జున్‌రావు, తోట రాజు, బిక్షపతి, నర్స య్య, మల్లయ్యలు పాల్గొన్నారు.

## గుడిసెలు తొలగించాలి

-ఆక్రమణదారులను ఆదేశించిన రెవిన్యూ,పోలీసు అధికారులు

ములకలపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త :



మండల పరిధిలోని పూసుగూడెం రెవిన్యూ పరిధిలోని 241/1లోని పట్టా భూమిలో గత పదిరోజుల నుంచి 2వేల గుడిసెలు నిర్మాణం చేసుకుని ఉన్న సోయం గంగులనగర్ పేరుతో ఏర్పాటు చేసిన గుడిసెలను వెంటనే తొలగించాలని రెవిన్యూ,పోలీసు అధికారులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని ఆక్రమణదారులను ఆదేశించారు.కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు పాల్వంచ సీఐ నాగరాజు,తహశీల్దార్ వీరభద్రం,అక్కడకు చేరుకుని వారికి చూచించారు.గుడిసెలు ఖాళీ చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దీనికి పోలీసు,రెవిన్యూ అధికారులకు ఆదివాసీ జేఏసీ నాయకులు వాసం రామకృష్ణ వివరణ ఇస్తూ మాకు వారం రోజుల వరకు గడువు ఇవ్వాలని, మేము కూడా కలెక్టర్‌ను కలిసి సమస్య వివరిస్తామని వారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు ఎస్సై సురేష్, ఆదివాసీ నాయకులు కోండ్రు పద్మ, ఆరెం ప్రశాంత్, కోండ్రు భాస్కర్, కుంజా రవి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్న సీఎం కేసీఆర్

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 4 - ప్రభాతవార్త:



తెలంగాణ ఆడబిడ్డలకు పెద్దన్న సీఎం కేసీఆర్ అని నియోజకవర్గ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించారు. సుమారు 27 మంది లబ్దిదారులకు రూ.27,03,132 చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, లక్ష్మీదేవిపల్లి కో ఆప్షన్ మెంబర్ జక్కుల సుందర్‌రావు, ఆత్మకమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, చాతకొండ మాజీ వార్డు మెంబర్ తూర్పాటి రామారావు, తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ రాంబాబు, సుజాతనగర్ టీఆర్ఎస్ మండల కార్యదర్శి సత్యనారాయణ, దొడ్డ రాంబాబు, కొంపెల్లి నరేష్‌లు పాల్గొన్నారు.

## సొసైటీ ఆధ్వర్యంలో మండలంలో ఆరు ధాన్యం కొనరుగోలు కేంద్రాలు ఏర్పాటు

- డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ, నవంబర్ 4 - ప్రభాతవార్త:



వర్షాకాలంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు పాల్వంచ సొసైటీ ద్వారా మండలంలో 6 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం సభ్యులు, వ్యవసాయశాఖ అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో సమావేశం నిర్వహించారు. రెడ్డిగూడెం, కారెగట్టు, సోములగూడెం, నాగారం, దంతెలబోరలతో పాటు పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పేట చెరువులో 5 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు గ్రేడ్ ఏ రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శంభోశంకర్, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రాంమోహన్‌జావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, యర్రంశెట్టి మధుసూధన్‌రావు, సామా జనార్థన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, నవంబర్ 4 - ప్రభాతవార్త: మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య వెలిసిన కనకదుర్గ దేవస్థానం పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు, అభిషేకాలు చేశారు.

## ఎస్సీ వసతిగృహాన్ని సందర్శించిన డీడీ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 4- ప్రభాతవార్త:



రామవరంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో సీడబ్ల్యూఆర్ఎఫ్ స్కీం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎస్సీ వెల్ఫేర్ డీడీ అనసూయ తనికీ చేశారు. పనులు ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతతో జరిగేలా చూడాలని హాస్టల్ వార్డెన్ పవన్‌ను సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వారికి మెరుగైన వసతులు అందేలా చూడాలన్నారు. ఆమె వెంట ఏఎస్సీ డబ్ల్యూవో వెంకటేష్ పాల్గొన్నారు.

## గిరిజన పాఠశాలలను సందర్శించిన మానిటరింగ్ టీం జీసీడీవో

చండ్రుగొండ, నవంబర్ 4 - ప్రభాతవార్త:



మండలంలోని తిప్పనపల్లి తండా, బాలికుంట గిరిజన ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఐటీడీఏ పీఎంఆర్‌సీ మానిటరింగ్ టీం జీసీడీవో అలివేణి మంగతాయారు పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా తీరును ఆమె విద్యార్థుల సామర్థ్యాల ద్వారా తెలుసుకున్నారు. బాలికుంట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమెతోపాటు ఆర్‌పీలు హన్మంతు, సీఆర్‌పీలు అప్పారావు, హెచ్‌ఎం అప్పారావు, టీచర్ నాగరాజు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 4 - ప్రభాతవార్త: మండలంలోని చాతకొండ ఆరవ బెటాలియన్ కమాండెంట్ వీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బియ్యం, ఉప్మారవ్వ, చింతపండు, కందిపప్పు, నూనెతో పాటు ఇతర సామాగ్రిని కమాండెంట్ చేతుల మీదుగా అందించారు. ఈకాయ్ ఏఆర్‌సీ ఆఫ్ 6వ బెటాలియన్ టీఎస్ఎస్‌పీలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్‌ఎస్సైలు సూర్య, మధుసూధన్‌రెడ్డి, నవీన్, ఆంజనేయులు , సిబ్బంది పాల్గొన్నారు.



# ఐఎస్ఎల్ విజయవంతానికి ప్రణాళిక సిద్ధం చేయాలి

**-ఐటిడిఏ పీవో గౌతమ్‌పోట్రు**



భద్రాచలం, ప్రభాతవార్త : ఈనెల 28వ తేదీ నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ (ఐఎస్ఎల్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటిడిఏ పిఓ గౌతమ్ పోట్రూ తెలిపారు. గురువారం ఐటిడిఏ పీఓ ఛాంబర్ నందు ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడల నిర్వహణపై గిరిజన సంక్షేమ, ఎస్సి గురుకుల ఆర్సిఓ, విద్య, పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన విధులపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13 అంశాల్లో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలకు ఏడు సొసైటీల నుంచి 3500 మంది బాలురు బాలికలు ఈ స్పోర్ట్స్ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. భోజన కౌంటర్లు వద్ద రద్దీ నియంత్రణకు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. క్రీడాకారులకు వసతి సౌకర్యం కల్పనకు ఇన్చార్జిలను నియమించినట్లు చెప్పారు. వసతి కల్పనాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా మరమ్మత్తులు నిర్వహించి సిద్ధం చేయాలని చెప్పారు. మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. క్రీడాకారులకు, రిఫరీలకు వేరు వేరుగా వసతి సౌకర్యం కల్పించాలని చెప్పారు. భోజనాలు వద్ద బారికేడ్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్పోర్ట్స్ ఈవెంట్ క్యాలెండర్ తయారు చేయాలని ఆయన క్రీడల అధికారిని ఆదేశించారు. క్రీడా మైదానంలో విద్యుత్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డిపిఓ రమాకాంత్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, గిరిజన సంక్షేమ శాఖ డిడి రమాదేవి, గిరిజన ఇంజనీరింగ్ ఈఈ తానాజీ, డిఈ రాములు, డీఈఓ సోమశేఖర శర్మ, ఎస్సీ గురుకుల ఆర్‌సీఓ ప్రత్యూష, క్రీడల అధికారి వీరు నాయక్, ఏటిడబ్ల్యూఓలు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీలో యూనివర్సిటీ విద్యార్థులసర్వే

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 4 - ప్రభాతవార్త: మండలంలోని చాతకొండ పంచాయతీలో యూనివర్సిటీ కాలేజీ విద్యార్థులు మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులు గురించి, వాటిని పూర్తి చేసే క్రమంలో భాగంగా 35 మంది విద్యార్థుల బృందం సర్వే నిర్వహించారు. చాతకొండ సర్పంచ్ బాదావత్ అనూష ఈ విద్యార్థుల బృందానికి స్వాగతం పలికారు. పంచాయతీలో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాలు తదితర అంశాలపై వివరించారు. ఉన్నతి భారత్ అభియాన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పున్నం చందర్, సర్పంచ్ అనూష, యూబీఏ కో ఆర్డినేటర్ కుర్ర చీనా, సెక్రటరీ వంశీకృష్ణలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో



దుమ్ముగూడెం, ప్రభాతవార్త : దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా డీఐఈవో బి.సులోచనరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటలకు జూనియర్ కళాశాల పరిశీలన కోసం వచ్చిన డీఐఈవోకు కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు స్వాగతం పలికారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్రంలోనే ప్రథమ మార్కులు సాధించిన కొండా సాయితేజ అనే విద్యార్ది డీఐఈవో సులోచనరాణికు బొకేను ఇచ్చి ప్రిన్సిపల్, అద్యాపకులు స్వాగతం పలికారు. కళాశాలలో సిబ్బంది, విద్యార్ధులతో నిర్వహించే అసెంబ్లీలో పాల్గొన్నారు. విద్యార్ధులకు తగు సూచనలు, సలహాలను ఆమె అందించారు. ఇంటర్మీడియట్ విద్యార్డులు ఇప్పటినుండే పరీక్షలకు సన్నద్దం కావాలని ఆమె తెలిపారు. గత సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాదించిన కళాశాల విద్యార్ది అయిన కొండా సాయితేజను పూలబొకేను అందించి డీఐఈవో విద్యార్ధి అయిన సాయితేజను అబినందించారు. ఈ సందర్బంగా కళాశాలలో రికార్డులను పరిశీలించారు. కళాశాల నిర్వహణ పట్ల ప్రిన్సిపల్, అద్యాపకులను అభినందించారు.



# డీఆర్‌సీసీ వర్మీకంపోస్టు యూనిట్‌ను పరిశీలించిన చైర్‌పర్సన్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 - ప్రభాతవార్త: కొత్తగూడెం డీఆర్‌సీసీ డ్రై రిసోర్స్ కలెక్షన్స్ సెంటర్ పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, మూడో వార్డు కౌన్సిలర్ పరమేష్ యాదవ్‌లు పరిశీలించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్‌ల ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డీఎంఎఫ్ నిధులతో కోటి రూపాయల వ్యయంతో దీన్ని నిర్మించారు. మున్సిపాలిటీకి ఆదాయం చేకూరే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డీఆర్‌సీసీ ప్రాంగణంలో గ్రీనరీని పరిశీలించి వంగిపోయిన మొక్కలను కర్ర సహాయంతో నిలబెట్టాలని చుట్టూ పాదులు తీసి అడవిని తలపించే విధంగా మొక్కలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# కన్నుల పండువగా రామయ్య కళ్యాణం



భద్రాచలంకల్చరల్ ప్రభాతవార్త : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భద్రాద్రి రామయ్య కళ్యాణం కన్నులపండువగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నది నుండి జలాలను మేలతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధాన ఆలయానికి తీసుకున వచ్చి స్వామి వారి మూలవరులకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కళ్యాణ మూర్తులను బేడా మండపానికి భక్తుల జయజయ ధ్వానాల నడుమ తీసుకుని వచ్చారు. ముందుగా భద్రాద్రి దివ్యక్షేత్ర మహత్యాన్ని భక్తులకు అర్చక స్వాములు తెలిపిన అనంతరం కళ్యాణ తంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి కళ్యాణ తంతును కన్నుల పండువగా నిర్వహించారు. అనేక మంది దంపతులు ఈ కళ్యాణంలో పాల్గొని తరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి నూతన వస్త్రాలు, అక్షతలు, ప్రసాదం వితరణగావించారు. అదేవిధంగా సాయంత్రం ప్రతిశుక్రవారం నిర్వహించే సంధ్యాహారతి కార్యక్రమాన్ని అర్చక స్వాములు వైభవోపేతంగా నిర్వహించారు.

# అట్టహాసంగా శ్రీ మహాలక్ష్మీ యాగం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త:



అహోబిల మఠం శ్రీలక్ష్మీ నరసింహాస్వామి సన్నిధిలో అట్టహాసంగా క్షీరాబ్దిద్వాదశి ప్రయుక్త ధన్వంతరి నరసింహ సహిత మహాలక్ష్మీ యాగం గురువారం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులు పాటు సాగే ఈ యాగంలో మొదటి రోజు ఆయుష్య హోమం, రెండవ సుదర్శన హోమం, మూడవ రోజు శ్రీ లక్ష్మీనరసింహ మూల మంత్ర హోమం జరుగనున్నదని అన్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రధాన అర్చకులు డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ధర్మమార్గాన్ని దాని విశిష్టతను యువతలో పెంపొందించినట్లయితే భవిష్యత్‌లో కొంతవరకైనా సమాజంలో ధర్మం నిలబడుతుందని అహోబిలం పీఠాధిపతుల సూచన మేరకు ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో ధర్మరక్షణ కొరకు వాలంటీర్‌లను నియమించి సేవలందిస్తున్నామని, ఇంకా భక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, గ్రామ గ్రామన కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. అంతేకాకుండా కార్తీక మాసం శివ కేశవులకు ప్రీతి పాత్రమైనదని, ఇంత మంచి రోజులలో ప్రతి ఒక్కరూ భగవంతుని సన్నిధిలో జరిగే ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొనే విధంగా భద్రాచలం ఆహోబిల మఠంలో ఏర్పాట్లు చేశామని, అంతే కాకుండా కార్తీకమాసాన్ని పురస్కరించుకొని జరుగుతున్న శ్రీమహాలక్ష్మీ యాగ విశిష్టతను గురించి భక్తులకు తెలియజేశారు. కావున అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మూడు రోజుల పాటు సాగే యాగంలో పాల్గొని నరసింహుని కృపాకటాక్షములకు పాత్రులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్ శర్మ, పవన్ కుమార్ శర్మ, వేదపండితులు శ్రీనివాస్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఏరియా కార్పోరేట్ జట్టు ఘన విజయం

కొత్తగూడెం స్పోర్ట్స్, నవంబర్ 4 - ప్రభాతవార్త:



సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియా గోలేటిలో ఈ నెల 2,3 తేదీల్లో గోలేటిలో జరిగిన కంపెనీస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కొత్తగూడెం ఏరియా కార్పోరేట్ జట్టు శ్రీరాంపూర్ ఏరియా జట్టుపై ఘన విజయం సాధించారు. ఇందుకు సంబంధించిన ఏరియా జీఎం జక్కం రమేష్, ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్‌లకు ఫుట్‌బాల్ క్రీడాకారులు కృతజ్ఞతలు తలెఇఆపరు. టీం కెప్టెన్, సభ్యులు వెంకటేశ్వర్లు, ఎస్‌కే గులాంగౌస్, రాజ్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్, అశోక్, కే.అశోక్, రత్నకుమార్, అశోక్, కే.శ్రీనివాస్, సునీల్, టీం మేనేజర్‌లు పాల్గొన్నారు.

# ప్రగతి నివేదికలు సిద్ధం చేయండి




**మొదటి పేజీ తరువాయి...**

**రఘునాథపాలెం, నవంబర్ 4(ప్రభాతవార్త):**
ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రగతి నివేదకలు సిద్ధం చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం పాపటపల్లి,విఆర్ బంజర గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ సభల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలకు సర్పంచ్‌లు చెన్నబోయిన ముత్తమ్మ, బానోత్ విజయ అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం వల్ల గ్రామాల రూపురేఖలు మారిపోయాయని, ఒక్క ఏడాదిలో రూ.12 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని ఏకైక మండలం రఘునాథపాలెం సింహ భాగంలో మేరకు ప్రతి ఏటా తన కోటా కింద విడుదలవుతున్న నిధులన్ని మండలానికే కేటాయించి పెద్ద పీట వేశామని పేర్కొన్నారు. ఒకనాడు వెనుకబడ్డ ప్రాంతంగా ఉన్న పాపటపల్లి ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకొని సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలతో అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. రైతుబంధు, రైతుభీమా, నిరంతరం విద్యుత్ సరఫరా, కళ్యాణలక్ష్మి,షాదీ ముబాకర్, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్‌లు వంటి పథకాలు ప్రతి ఇంట్లో పొందుతున్నారని వివరించారు. తొలుత మంత్రి సిమెంట్ రహదారులకు భూమిపూజ చేసి నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ మాట్లాడతూ ఈ గ్రామంలో గతంలో 30 ఇండ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించామని, కొత్తగా రైతు వేదిక పక్కన మరో 60 ఇండ్లను పూర్తి చేసి మిగిలిన వారికి కేటాయించామన్నారు. ఈ గ్రామంలో ఒక్కరూ కూడా ఇండ్లు లేని లబ్ధిదారులుగా ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఇచ్చామన్నారు. విఆర్ బంజర గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలకు, సిసి రోడ్లకు పాపటపల్లి గ్రామంలో పూర్తయిన రూ.80 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీల వల్ల గ్రామంలో పూర్తిగా అభివృద్ధిలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పివో గౌతమ్ పోట్రు,డిఆర్‌డివో విద్యాచందన, ఈఈ తానాజీ, ఎంపిపి గౌరి, వైస్ ఎంపిపి రవి, మాజీ జడ్పీటీసీ కుర్రా భాస్కర్‌రావు,వీరూ నాయక్, మాజీ సర్పంచ్‌లు లాలు నాయక్,చెన్నబోయిన సైదులు, ఇఇలు శ్రీనివాస్, శ్యాంప్రసాద్, ఎంపిడివో రామకృష్ణ, తహశీల్దార్ నరసింహారావు,మాజీ ఆత్మ చైర్మన్ బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.







## జిల్లా పద్మాశాలి వనసమారాధనోత్సవ కరపత్రం ఆవిష్కరణ

**ఖమ్మం కార్పొరేషన్ ప్రభాతవార్త :**
ఖమ్మం జిల్లా పద్మశాలి వనసమారాధనోత్సవ కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి రాష్ట్ర కమిటి అధ్యక్షులు కమర్తపు మురళి మాట్లాడుతూ..ఈ నెల ఆరో తారీఖున ఆదివారం గొల్లగూడెం రోడ్డులో చెరుకూరి రామకోటి గార్డెన్ నందు పద్మశాలి సంఘ అందర్నీ ప్రేమ పూర్వకంగా ఆహ్వానిస్తూ పకార్త్‌క వనభోజనాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,అకిల భారత పద్మశాలి సంఘం కండగట్ల స్వామి, అంతేకాకుండా స్టేట్ కమిటి సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఉదయం జ్యోతి ప్రజ్వలన అనంతరం అన్ని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం మెయిన్ సెంటర్ల నుండి బొమ్మ కాలేజీ బస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొమ్మ రాజేశ్వర్‌రావు,చిలకమర్తి శ్రీనివాసరావు, పెండం జనార్ధన్, ఆశోక్, దూస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వికాస్ స్కూల్ విద్యార్థులకు దంత పరీక్షలు

**ఖమ్మం బ్యూర్, నవంబర్ 4 ప్రభాతవార్త:**
ఖమ్మం నగరంలోని వీడివోస్ కాలనీలో గల వికాస్ కిండర్ గార్డెన్ స్కూల్ ఆవరణలో శుక్రవవారం దత తనిఖీ, అవగాహన శిబిరాన్ని సీనియర్ దంత వైద్యులు పరుచూరి వెంకటేశ్వరరావు బృందం నర్సరీ నుండి 6వ తరగతి విద్యార్థులకు సమగ్ర దంత పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో దంత అవగాహన చర్చలో భాగంగా విద్యార్థులకు సాధారణ దంత వ్యాధుల గురించి దంత క్షయానికి దారితీసే ఆహారపు అలవాట్లు, ఆహార ఎంపికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ వై.లావణ్య, ఉపాధ్యాయ బృందం, చిన్నారులు దంత వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.




## 6 నుండి డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ తరగతులు ప్రారంభం

**ఖమ్మం బ్యూరో,నవంబర్ 4 ప్రభాతవార్త:**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఖమ్మం పరిధిలో 2022-2023 విద్యా సంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్-1, ద్వితీయ సంవత్సరం సెవమిస్టర్- 3,తృతీయ సంవత్సరం సెమిస్టర్-5 కౌన్సిలింగ్ తరగతులు ఈ నెల 6 నుండి ప్రారంభిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ మొహమ్మద్ జాకీరుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడ తాయన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. అలాగే ఈ సంవత్సరం డిగ్రీ, పిజిలో చేరాలనుకునే అవకాశం ఈ నెల 5 వరకు పొడిగించామన్నారు. 200 అపరాధ రుసుంతో ఈ నెల 15 వరకు అవకాశం ఉందని తెలిపారు.



## వైభవంగా జరిగిన సామూహిక శ్రీరామసత్యనారాయణ స్వామి వ్రతములు

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**
భద్రాచలం శిల్పినగర్‌లో గల శ్రీదుర్గా గాయత్రి సర్వదేవతా శక్తిపీఠంలో శుక్రవారం కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామికి రుద్రాబిషేకం, శ్రీరమా సత్యనారాయణస్వామి వారికి సామూహిక సత్యనారాయణవ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకులు పండిత కే.వీ.సుబ్రహ్మణ్యశర్మ, విశ్వతేజశర్మ, వెంకటేశ్వరరావు, యోగానందరఘురామ్ పాల్గొన్నారు.

**-భద్రాద్రిలో లక్షా ఆవు పిడకల మహాయాగం**

ఈ నెల 6వ తేదీ నుండి 16వ తేదీ వరకు శ్రీగాయ్త్రరిపీఠం నందు లక్ష ఆవుపిడకలతో శ్రీలక్ష్మీనారాయణ పూర్వక మహారుద్రయాగం జరుపుతున్నట్లు కే.వీ.సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.11 రోజులు జరిగే ఈ మహాయజ్ఞలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ప్రతి రోజు ప్రత్యేక దేవతా హోమాలు జరుచున్నవని తెలిపారు.

# వ్యాపారాభివృద్ధికి దోహదపడాలి



**-మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**స్తంభాద్రి, నవంబర్ 4 ప్రభాతవార్త:**
సొంత లాభం కొంత మానుకో అని లాభాపేక్ష ఆశించకుండా వినియోగదారులకు నాణ్యత సరసమైన ధరలకి ఆహార పదార్థాలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు ఆర్టీసీ బస్‌స్టాండ్ పక్కన శుక్రవారం నూతనంగా స్థాపించిన ఎస్‌ఆర్ స్వీట్, బ్రేకరీ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు శ్రీవిద్య, దుకాణ నిర్వాహకులు జడ మల్లేష్ అనిత యాదవ్, సహారిక యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌ప్రెస్ రైళ్లను క్లీనింగ్ చేయించాలి

**కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు కొదుమసింహం పాండురంగాచార్యులు**

**కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 - ప్రభాతవార్త:**
భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్‌లోకి వచ్చే కాకతీయ ఎక్స్‌ప్రెస్, సింగరేణి ఎక్స్‌ప్రెస్‌లకు సరైన క్లీనింగ్ జరపాలని కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు కొదుమసింహం పాండురంగాచార్యులు డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్డుకు వచ్చే కాకతీయ, సింగరేణి రైళ్లకు క్లీనింగ్ భద్రాచలం రోడ్‌లోనే జరపాల్సి ఉండగా, కానీ సరైన క్లీనింగ్ లేనందున ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల పురుషోత్తం, సతీష్ యాదవ్, అజయ్, హీరాలాల్ పాసి, కల్లూరు కృష్ణ, విజయ్, సోనీగాంధీ పాల్గొన్నారు.






## టీఆర్ఎస్‌పార్టీ మండల ఇన్‌చార్జిల నియామకం

### - ప్రకటించిన ప్రభుత్వవిప్ రేగా

*మణుగూరు, ప్రభాతవార్త, నవంబర్4:*

పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలకు టీఆర్ఎస్‌పార్టీ ఇన్‌చార్జిలను నియమించినట్లు ప్రభుత్వవిప్, పినపాక ఎమ్మెల్యే, టీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు శుక్రవారం ప్రకటించారు. బూర్గంపాడు మండలం ఇన్‌చార్జిగా మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు, అశ్వాపురం మండల ఇన్‌చార్జిగా ఆత్మకమిటీ చైర్మన్ పటేల్ భద్రయ్య, కరకగూడెం మండలం ఇన్‌చార్జిగా వీరభద్రరాజు, గుండాల మండలానికి కోలేటి భవానీశంకర్, ఆళ్లపల్లి మండల ఇన్‌చార్జిగా వట్టం రాంబాబు, సారపాకటౌన్ ఇన్‌చార్జిగా తాళ్లపల్లి యాదగిరిగౌడ్, మణుగూరు టౌన్ ఇన్‌చార్జిగా కందుల కృష్ణార్జునరావులను నియమించినట్లు ఆయన తెలిపారు.

## ఈ నెల 6న ఆర్యవైశ్య కార్తీక వనమహోత్సవం

*మణుగూరు, ప్రభాతవార్త, నవంబర్4:*

ఈ నెల 6న మండలంలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ ఆలయం వద్ద వాసవీ ఆర్యవైశ్య కార్తీక వనమహోత్సవం కార్యక్రమం జరుగుతుందని వాసవీ ఆర్యవైశ్య వనమహోత్సవ ట్రస్ట్ మణుగూరు ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. వాసవీయులందరూ ఆర్యవైశ్య వనమహోత్సవంలో పాల్గొని ఉల్లాసంగా గడపాలని వారు ఆకాంక్షించారు. భాగంగా చిన్నారులకు ఫ్యాన్సీడ్రస్ పోటీలతో పాటు మహిళలకు, పురుషులకు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## దీర్ఘకాలిక మందులు తీసుకునే పేషెంట్లకు ప్లాస్టిక్ బ్యాగులు పంపిణీ

*అశ్వాపురం,నవంబర్04,ప్రభాతవార్త.*



దీర్ఘకాలిక జబ్బులబారిన పడి,ప్రతినెల మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మందులు తీసుకుంటున్న పేషెంట్లకు మండల వైద్యాధికారి మణికంఠరెడ్డి ఆదేశాలమేరకు శుక్రవారం అశ్వాపురం సర్పంచ్ బానోత్ శారదా చేతులమీదుగా ప్లాస్టిక్ బ్యాగులు పంపిణీ చేశారు. పేషెంట్లకు గుర్తుండే విధంగా ఉదయం వేసుకునే ట్యాబ్లెట్లు ఒకమడతలో, సాయంత్రం వేసుకునే ట్యాబ్లెట్లు మరొక మడతలో వుంటాయి.సర్పంచ్‌తో పాటు,ఏఎన్ఎంలు శాంతాబాయి,ఆశావర్కర్ రమణ కలిసి పేషెంట్ల ఇంటివద్దకు వెళ్ళి బ్యాగులు అందజేశారు.

## వీవోఏలకు ట్యాబ్ ఆపరేటర్లకు పుస్తకనిర్వాహణపై శిక్షణ

*ప్రభాతవార్త ప్రతినిధి- హన్మకొండ:*



గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశ మందిరంలో ఖరీఫ్ సీజన్‌కు గాను నిర్వహించబోతున్న 52 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబందించిన వీవోఏలకు ట్యాబ్ ఆపరేటర్లకు పుస్తక నిర్వాహణ, ఓపీఎంఎస్ డేటా ఎంట్రీపైన శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన అడీషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు సంబందించిన వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. డీఆర్‌డీవో, డీయస్‌వో, డీయమ్, డీపీఎం, ఏపీఎం, సీసీలు, ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది గులాబీజెండానే

### - టీబీజీకేఎస్ మణుగూరుఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రావు

*మణుగూరు, ప్రభాతవార్త, నవంబర్4:*

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది గులాబీజెండానే అని తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం (టీబీజీకేఎస్) మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రావు అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు ఏరియా కేసీహెచ్‌పీ వద్ద గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలు కాపడటంలో తమ యూనియన్ ఎనలేని సేవలు చేస్తుందన్నారు. ఉన్నహక్కులను కాపాడుకుంటూనే కొత్త హక్కులను కార్మికవర్గానికి సాధించిపెట్టిన ఏకైక కార్మికసంఘం తమదేనన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన అర్హతగల కొండాపురం భూగర్భగని కార్మికులకు సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పదోన్నతులను గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఇప్పిస్తుంటే తట్టుకోలేక వాటిని ఏవిధంగానైనా అడ్డుకునేందుకు కొన్ని కార్మిక సంఘాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎవరెన్ని విషప్రయోగాలు చేసినా ఏరియా నందు 220 సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పదోన్నతులు వచ్చేవారంలో ఇప్పించి తీరుతామన్నారు.



ఏఐటీయూసీ కార్మిక సంఘానికి ఎన్నికలపై ఉన్న ప్రేమ కార్మికసంక్షేమంపై లేదన్నారు. 11వ వేజ్‌బోర్డును పరిష్కరించడంలో సంఘాలు విఫలమయ్యా యన్నారు. సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని ముందుగా సింగరేణి యాజమాన్యాన్ని కోరిందే తమ సంఘం అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ రవూఫ్, బ్రాంచి నాయకులు కాపా శివాజీ, బానోత్ కృష్ణ, సీహెచ్‌వీ.రెడ్డి, సీహెచ్. అశోక్, రామారావు, నాగెల్లి వెంకటేశ్వర్లు, గంగాధర్, బాలాజీ, వెంకట్రావు, శంకర్, డీవీ.ముత్యం, అజిత్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

*అశ్వాపురం,నవంబర్04,ప్రభాతవార్త.*

అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం సకాలంలో తీసుకోవాలని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి తెలిపారు. గ్రామపంచాయితీ కార్యాలయంలో ప్రతినెల మొదటి శుక్రవారం నిర్వహించే విలేజ్ హెల్త్ శానిటైజేషన్ అండ్ న్యూట్రిషన్ కమిటి సమావేశంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోవున్న గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపట్ల ఆరోగ్య



కేంద్ర వైద్య ఆరోగ్యసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందజేయాలన్నారు.ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి సంక్షేమ,సహాయం వారికి చేరాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణీలకు పండ్లు పంపిణీ చేయడమే కాక, బలహీనంగావున్న గర్భిణీ మహిళకు 1000రూపాయలు నగదు అందజేశారు. ఎంపీటీసీ కమటం నరేష్, ఏఎన్ఎంలు లలితకుమారి, నాగమణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకలక్ష్మి,అంగన్‌వాడీ టీచర్లు హంసవేణి, సుధ, లత, శైలజ,ఆశావర్కర్ కృష్ణవేణి,పంచాయితీ కార్యదర్శి సైదులు,మహిళలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు భద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలి

### -ఐఎఫ్‌టియు జిల్లా పంచాయతీ కార్మికుల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి

*పినపాక ప్రభాతవార్త:*

గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించడమే కాకుండా జీతాలను పెంచాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఆర్.మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ పినపాక మండలం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు సమయ పాలనతో సంబంధం లేకుండా పనిచేస్తూ ప్రజల



సేవచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు. రోజురోజుకు నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతూ చాలి చాలక వచ్చే రూ.8,500లతో తమ కుటుంబాలను ఎలా సమస్యల మీద దృష్టి పెట్టి, వారి సేవలను గుర్తించి కనీస వేతనాన్ని 26 వేలుగా సవరించి అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పని భారం ఎక్కువ ఉన్న నేపథ్యంలో అదనపు సిబ్బందిని నియమించాలని, తాత్కాలిక మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పిఆర్సీ ప్రకారం 30% ఫిట్మెంట్‌ను పంచాయతీ కార్మికులకు వర్తింపజేయాలని, ప్రమాద మరణానికి భీమా రూ.10 లక్షల, సహజ మరణానికి రూ.5లక్షల భీమా పథకాన్ని అమలు చేయాలని కార్మికుల తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టియు పినపాక మండల అధ్యక్ష కార్యదర్శులు జి.భాను, ఎం.సతీష్, బిజ్జా బాలరాజు, పోలబోయిన నాగరాజు, నవాతు రాము, గుమాసు ముత్తయ్య, వి.సంపత్, బి.శ్రీను, కే.లక్ష్మయ్య, బి.కృష్ణ, కే.రామకృష్ణ, ఆర్.బుచ్చిబాబు, డి.రవి, పి.మధు, కే.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై కేసులు నమోదు చేయాలి

### -సుబ్బంపేట పోడు భూమి సర్వే చేయాలి : టీఏజిఎస్

*చర్ల ప్రభాతవార్త:*

చర్ల మండలంలోని చిన్న ముడిసిలేరు ఆదివాసీలు ఐదుగురుపై ఫారెస్ట్ అధికారులు చర్ల ఫారెస్ట్ కార్యాలయంలో అధికారులు నిర్బంధించి తిండి పెట్టకుండా ఫారెస్ట్ అధికారులు వారిని కొట్టడం, చిత్రహింసలకు పాల్పడినారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సరియం కోటేశ్వరావు అన్నారు. వారిపై కేసులు నమోదు



చెయ్యాలని, అధికారులను విచారించాలి, కానీ గదిలో నిర్బందించి కొట్టడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిఐ ఆశోక్, తహాసీల్దారులకు వినతిపత్రం అందజేశారు. సుబ్బంపేట పోడు భూమి సర్వే చేయాలని, సగం సర్వే చేసి నిలుపుదల చెయ్యడం సరైనది కాదని అన్నారు. పక్క గ్రామాలలో చేసి సుబ్బంపేట కావాలనే ఆపాడం సరైనది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కారం నరేష్, యాక సుజాత, రామరావు, చంటి, వెంకట్, చంద్రం, మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపంథా చిల్లర రాజకీయాలు మానుకోవాలి : ఎన్‌డి



**గుండాల, ప్రభాతవార్త :**
సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ నాయకత్వంపై ప్రజాపందా పార్టీ చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎంపిపి ముక్తి సత్యం, గుండాల సర్పంచ్ కోరం సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 1న ప్రజాపందా పార్టీ నిర్వహించిన అమరవీరుల వర్ధంతిసభలో న్యూడెమొక్రసీ పార్టీపై, ముఖ్యంగా మా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధుపైన చేసిన ఆరోపణలు సత్యదూరమని అన్నారు. వారు నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు రాకుండా అడ్డుకున్నట్లు సభలో చెప్పడం సరైంది కాదని, అడ్డుకున్నట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మా పార్టీ నుండి వారు విడిపోయిన అనంతరం పోటు రంగారావు, గుమ్మడి నర్సయ్యల పేర్లు ఉపయోగించుకొనే దౌర్భాగ్య పరిస్థితుల్లో న్యూడెమొక్రసీ పార్టీ లేదన్నారు.

పార్టీలో 30 సంవత్సరాలకు పైగా అజ్ఞాత జీవితం గడిపారని ప్రజలతో మమేకమై పనిచేసారని సంవత్సరానికి పైగా పిడి యాక్ట్‌కేసుతో మధు జైలు జీవితం గడిపారన్నారు. ఇప్పటికైనా ప్రజాపందా పార్టీ అసత్య అరోపణలు మానుకోవాలని లేనియెడల రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పకతప్పదన్నారు. ఈ సమావేశంలో నరేశ్, పర్శక రవి, వై వెంకన్న, ఈసం కృష్ణ, గడ్డం లాలయ్య, అజ్గర్, మానాల ఉపేందర్, ఊకె బాబు, లాలు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్కీం వర్కర్లతో వెట్టిచాకిరి చేయించడం మానుకోవాలి

**గుండాల, ప్రభాతవార్త :**
ఒకే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న స్కీం వర్కర్లతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, ఇల్లెందు ప్రాంతీయ కన్వీనర్ అబ్దుల్‌నబీలు అన్నారు. మండల కేంద్రంలో సిఐటియు ద్వితీయ మండల మహాసభ శుక్రవారం ఎం ధనమ్మ, ఎండి నజీమాల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే డిపార్ట్‌మెంట్లో స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడి, మినీ, డైల్‌వేజ్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చే వేతనాలలో చాలా తేడాలు ఉన్నాయని కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా పనిభారాన్ని పెంచి వారిని మానసికంగా, శారీరకంగా పాలకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. గత 20 యేళ్ళుగా మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని నిత్యావసర సరుకుల ధరలు పెరిగినప్పటికీ వారికి ఇచ్చే బిల్లులు పెంచడంలేదని తీంతో వారు అప్పులభారంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశాలతో అధికార్లు చేయాల్సిన సాంకేతిక పనులు, అంగన్వాడీ టీచర్లతో బిఎల్‌వోలంటూ ఆధార్ ఓటర్ అనుసంధానమంటూ పనులు చేయిస్తూ వారు చేసే పనులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు.



నూతన మండల కమిటి ఎన్నిక : సిఐటియు ద్వితీయ మండల మహాసభలో సిఐటియు మండల అధ్యక్షురాలిగా వజ్జ సుశీల, కో కన్వీనర్‌గా సామ్మలనుతోపాటు 25 మందితో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ తెలిపారు.

# టీఆర్ఎస్ నాయకునిపై కత్తితో దాడి

**మహబూబాబాద్ రూరల్, నవంబర్ 04, ప్రభాతవార్త:**



మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు ప్రాంతానికి చెందిన అధికార టీఆర్ఎస్ పార్టీ నాయకులు,

దివ్యాంగులు, మాజీ వార్డు సభ్యులు ఎడబోయిన సత్యనారాయణపై శుక్రవారం అదే ప్రాంతానికి చెందిన కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు కత్తితో దాడి చేయగా అతని కడుపుపై తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ జిన్నారెడ్డి పద్మజా వెంకటేశ్వర్లు ఆసుపత్రికి చేరుకొని గాయపడిన సత్యనారాయణను జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడే ఉన్న వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

# వసతి గృహాల కార్మికులను ఆదుకోవాలి



**మహబూబాబాద్ నెహ్రూసెంటర్, నవంబర్ 04, ప్రభాతవార్త:**
గత కొన్ని సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరుతూ గత కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం ముందు కార్మికులు ఆందోళన చేపడుతున్నారు. దానిలో భాగంగానే శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ వసతి గృహాలలో పనిచేస్తున్న వర్కర్లను క్రమబద్ధీకరణ చేయాలని అర్హులైన వారందరిని రెగ్యులరైజ్ చేసి వారికి సంబంధించిన సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సౌందర్య, వెంకటయ్య, పాపమ్మ, జయ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు : జిల్లా ఎస్పీ

**మహబూబాబాద్, నవంబర్ 04, ప్రభాతవార్త:**



డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపే వ్యక్తుల మాట నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని అలాంటివారు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది నియామకాలలో హైద్రాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఏరియా ఆసుపత్రిలో సూపర్వైజర్‌గా బానోత్ వరుణ్ కుమార్‌ను నియమించుకొని అతని ద్వారా కొంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వివిధ దినపత్రికలలో వార్తా కథనాలు రావడంతో పాటు కొంతమంది డబ్బులిచ్చి మోసపోయిన నిరుద్యోగులు పోలీసులను ఆశ్రయించారు. వారి వద్ద నుండి డబ్బులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు.

# నూతన మెడికల్ కళాశాల పనుల పరిశీలన



**మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబర్ 04, ప్రభాతవార్త:**
ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న నూతన మెడికల్ కళాశాలతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లు పరిశీలించారు. శుక్రవారం నిర్మాణం జరుగుతున్న కార్యాలయాలతో పాటు రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత శాఖాధికారులతో పరిశీలించి నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా॥ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# మాదిగల అలాయ్ బలాయ్‌ను విజయవంతం చేయండి



**ఇల్లెందు, ప్రభాతవార్త :**
నవంబర్ ఏడున హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల అలాయ్ బలాయ్‌ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదురి రవిమాదిగ పిలుపునిచ్చారు. ఇల్లెందు పట్టణంలోని 12 వ వార్డులోని ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్‌హోమ్ వేదికగా నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికల్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల రిజర్వేషన్ పెంచిన విధంగానే ఎస్సీల దామాష ప్రకారం రిజర్వేషన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజలింలగు, నాయకులు చిర రవి, లక్ష్మి, అనుసూర్య, మైసమ్మ, శాంత, కోటమ్మ, చంద్రమ్మ, నాగరాజు, సురేందర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కిట్లను పంపిణీ చేసిన మున్సిపల్ కౌన్సిలర్



**ఇల్లెందు, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాన్ కమ్యూనిటీ కేబుల్ డీసీజెస్ బీపీ షుగర్ వ్యాధులకు మందులు ఉన్న కిట్లను ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో కౌన్సిలర్ సామల మాధవి శుక్రవారం రోగులకు కిట్లను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటరమణ, జె.సింధు, కృష్ణకుమారి, ఆశ కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.

# న్యూడెమొక్రసీ సీనియర్ కార్యకర్త మృతి



**టేకులపల్లి (ఇల్లెందు), ప్రభాతవార్త :**
టేకులపల్లి మండలం గోల్యాతండా పంచాయతీ పరిధిలోని రామాలయం ఏరియాలో నివాసముంటున్న న్యూడెమొక్రసీ సీనియర్ కార్యకర్త గుగులోత్ సక్రు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మృతి చెందిన వార్త తెలియగానే జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్‌లు వెళ్లి సక్రు మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోల్యాతండా సర్పంచి బోడ నిరోషా మంగీలాల్, టేకులపల్లి మాజీ సర్పంచి ఇస్లావత్ రెడ్యానాయక్, వార్డు సభ్యులు ఎ.వెంకన్న, జి.శ్రీను, పి.సుజాత, న్యూడెమొక్రసీ నాయకులు బానోత్ ఊక్లా, భూక్య హర్జ్యా, కె.వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణ, ఖాదర్‌బాబా, బిచ్చు, రవికుమార్, వెంకన్న, సురేష్, చింటులు పాల్గొన్నారు.

## వాసవి దేవాలయంలో అన్నదానం రామాలయంలో రామ నామస్మరణ





**అశ్వారావుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త:**
పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకొని ఆలయంలో మహిళలచే సామూహిక భగవత్ గీతా పారాయణంను నిర్వహించారు. మద్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా స్థానిక రామాలయంలో భక్తులు శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ రామనామాన్ని ఏకధాటీగా ఉదయం నుండి సాయంత్రం వరకూ జపించారు.




## అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిన పడమర లోకారం

**- సుమారు 2 వేల మంది అయ్యప్ప భక్తులతో అంగరంగ వైభవంగా పడిపూజ**



**కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త**
మండల పరిధిలోని పడమర లోకారం గ్రామపంచాయితీలో శుక్రవారం రాత్రి కొణిదల రాధాకృష్ణ నాయక్ గురుస్వామి ఆధ్వర్యంలో కళ్యాణపు చిన్న కొండలరావు స్వామి దంపతుల ఏకైక కుమార్తె సనందా స్వామి ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది అయ్యప్పభక్తులతో మహాపూడి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పడమర లోకారం గ్రామం అయ్యప్పనామ స్మరణతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి కృపాకటాక్షములు కలగాలని కోరుతూ తాటిపాక కృష్ణస్వామి కచేరి బృందంచే ఆలపించిన భక్తిగీతాలు



ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అద్దంకి వెంకటేశ్వరరావు గురుస్వామి, కళ్యాణపు రామయ్యస్వామి, గుగులోత్ శంకర్ ప్రసాద్‌స్వామి, రావి హరికృష్ణస్వామి, వడ్లమాని పుల్లారావు స్వామి, గుండ్ల తిరుపతిరావుస్వామి, బాణోత్ వీరేంద్రస్వామి, ఇస్లావత్ నరసింహారావు స్వామి, పర్వత ప్రభాకర్‌రావు స్వామి, శీలం బ్రహ్మాజిస్వామి, సత్తెనపల్లి అప్పారావు స్వామి, పాడ్యా ప్రసాద్ స్వామి, పర్వత రవి స్వామి, దంతాల లింగారావు స్వామి తదితరులు పాల్గొన్నారు.

### రామకృష్ణాపురం ఆలయంలో రామ నామ ఏకాహం

**కామేపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త:**
రామకృష్ణాపురం గ్రామంలో వేంచేసి ఉన్న సువర్చల సహిత అభయాంజనేయస్వామి వారి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అవధూతేంద్ర భక్త మండలి కన్వీనర్ గొట్టుపర్తి శివాజి బృందంచే శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు రామనామ ఏకాహం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అమిరినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఏకాహం నిర్వహణకు సంబంధించిన వివరాలను శుక్రవారం వివరించారు. అదే విధంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 6గంటలకు సహస్ర దీపాలంకరణ (1008) కార్యక్రమంను అత్యంత వైభవపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్త మండలికి చెందిన బైరోజు శ్రీనివాసరచారి, సర్పంచ్ జర్పుల రామారావు, భాగం రంగారావు, కొమ్మినేని భద్రయ్య, పోలూరి రామచంద్రయ్య, పేరసాని సందీప్, పోరండ్ల నర్సింహారావు, మేకల రామారావు, జుజ్జురి సత్యనారాయణ, ఏపూరి రామరావు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి



**అశ్వారావుపేట అర్బన్, నవంబర్ 4 ప్రభాతవార్త:**
గర్భిణీలు పౌష్టికాహారంను క్రమం తప్పకుండా తీసుకోవాలని గుమ్మడవల్లి పిహెచ్‌సి వైద్యాధికారి హరీష్ పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మడవల్లి సబ్‌సెంటర్‌లో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో గర్భిణీలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన అప్రమత్తత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ నిధులతో సిసి రోడ్డు పనులు



**అశ్వారావుపేట అర్బన్, నవంబర్ 4 ప్రభాతవార్త:**
మండల పరిషత్ నిధులతో మంజూరి కాబడిన సిసి రోడ్డు పనులను ఎంపిపి జల్లిపల్లి శ్రీరామమూర్తి శుక్రవారం ప్రారంభించడం జరిగింది. పేరాయిగూడెం పంచాయతీ పరిధిలోని మోడల్ కాలనీలో రూ.5లక్షలతో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు చొరవతో సిసి రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరి కాబడ్డాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నార్లపాటి సుమతి, ఎంపిటిసి మిండా హరి, కార్యదర్శి శ్రీరామమూర్తి, ఉప సర్పంచ్ జగన్నాథం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహ దినసరి కార్మికుల సమ్మె

**అశ్వారావుపేట టౌన్, నవంబర్ 4 ప్రభాతవార్త:**



గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగుల సమ్మె కొనసాగుతుంది. శుక్రవారం స్తానిక గిరిజన బాలిక వసతి గృహం ముందు దినసరి కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. మమ్మల్ని పర్మినెంట్ చేయాలని, సెలవులతో కూడిన 12నెలల జీతం తప్పకుండా ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన వారి యొక్క కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, ఆరోగ్యభీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, 30శాతం పిఆర్‌సి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో లక్ష్మి, నాగమణి, యల్లమ్మ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**దమ్మపేట, నవంబర్ 4 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నాచారంలో కొలువుదీరిన జగదాంబ సమేత జయ లింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను వైభవోపేతంగా నిర్వహించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకొని ఆలయంలో దంపతులతో పురోహితుల వేద మంత్రోక్షారణల మధ్య శాస్త్రోక్తంగా వ్రతాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## పాఠశాలలను సందర్శించిన ఎంఇఓ



**దమ్మపేట, నవంబర్ 4 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పలు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారిని కె లక్ష్మి శుక్రవారం సందర్శించడం జరిగింది. బంజెర కాలనీ, అర్బన్ కాలనీలను వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జునరావుతో కలిసి తనిఖీ చేసిన ఆమె మన ఊరు మన బడి కార్యక్రమ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఇదే క్రమంలో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మాథ్స్, ఇంగ్లీష్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్ఎ పరీక్షా పత్రాలు అడిగి తెలుసుకొని విద్యార్థులుఏ విధంగా వ్రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. దమ్మపేట ఎంపిపిఎస్ పాఠశాలలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా జరుగుతున్న వంట గది పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో వైద్య శిబిరాలు



**అశ్వారావుపేట రూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త:**
అశ్వారావుపేటలో గల మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర ఆశ్రమ పాఠశాలలో, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వినాయకపురం వైద్యాధికారి రాందాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసి పలు సూచనలు చేశారు. ఎవరికనా దగ్గు, జలుబు లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని పేర్కొన్నారు. వాతావరణం చల్లగా ఉన్న నేపధ్యంలో కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, వసగి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెచ్ఎ ప్రసాద్, సతీష్, వెంకటరమణ, నర్సు ఉషా, ప్రశాంతి, వార్డెన్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పర్యవేక్షణ పట్టించుకోని విద్యాశాఖ

**-టీచర్ కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు**

**-సెలవుపై వెళ్లిన టీచరు**

*కారేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త*

మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉండటంతో సింగిల టీచర్ పాఠశాలలో పరిస్తితి నేడు అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై సదభిప్రాయం లేని ప్రజలకు శుక్రవారం సింగరేణి మండలం గోవిందుతండా పాఠశాల పనితీరు చూస్తే అర్థం అవుతుంది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోవిందు తండా ప్రభుత్వ ప్రాదమిక పాఠశాలలో 16 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధా య్యయురాలు అనారోగ్య సమస్యలతో సెలవుపై వెళ్లారు. అయితే సమీపంలోని పాఠశాలలకు సంబందించిన ఉపాధ్యాయుల్లో ఎవరో ఒకరిని డిప్యూటేషన్‌పై తాత్కాలికంగా పంపించాల్సిన బాధ్యత మండల విద్యాశాఖపపై ఉంటుంది. ఈ పాఠశాల విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చి 11 గంటల వరకు టీచరు ఎవరూ రాకపోవడంతో





గ్రామస్తులు పాఠశాల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేసారు. కాగా పాఠశాల వద్దకు విలేకరులు వెళ్లారనే సమాచారం తెలుసుకుని మాదారం నుండి ఒక టీచర్ 11 గంటలకు పాఠశాలకు చేరుకున్నారు. దీనికి సంబందించి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ను సమాచారం అడగ్గా ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాదికారికి టీచర్‌నుఏర్పాటుచేయాల్సిందిగా తెలిపినట్లు వివరించారు. కాగా పాఠశాలలో ఇటీవల కాంపౌండ్ వాల్ నిర్మాణం, ఇతరత్రా పనులు నిర్వహిస్తున్నారు. టీచర లేకపోవడంతో పిల్లలకు ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహించాలని స్తానికులు ప్రశ్నించుకుంటున్నారు. వాస్తవానికి ఉపాధ్యాయులు సెలవులో ఉన్నపుడు మరుసటి రోజు పాఠశాలలో పనిచేసేందుకు మరొకరిని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత మండల విద్యాశాఖపై ఉంటుంది. మండలంలోని పలు సింగిల్‌టీచర్ పాఠశాల్లో సంబందిత ఉపాధ్యాయుడు సెలవుపెడితే ఇలాంటి పరిసి ్తతులే నెలకొంటున్నాయి. ఇప్పటికైనా మండల విద్యాశ్ఖ పనితీరు మార్చుకోకపోతే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మాట్లాడుతూ ఇటీవల కాలంలో పాఠశాలలో ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో పిల్లలకు ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. పాఠశాలలో సమయపాలన ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆశ్రమ పాఠశాల

**-హెచ్ ఎం. అధ్యాపక సిబ్బంది**

**కృషితో సత్ఫలితాలు**

*కారేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త*

ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యను బోదించే క్రమంలో పాఠశాల ప్రదానోపాధా య్యయులు, అద్యాపక సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్న క్రమంలో నేడు ఐటిడిఎ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో ఉత్తమంగా నిలుస్తూ స్వచ్ఛ పాఠశాల అవార్డు చేరువలోఉంది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయ..సింగరేణి మండలం ఉసిరి కాయలపల్లి ఆశ్రమ పాఠశాల నేడు వివిధ అంశాలలో ఉత్తమ పలితాలను సాధిస్తూ ఐటిడిఎ పరిధిలో ఇతర పాఠశాలలకు ధీటుగా





పనిచేస్తుండటమే నిదర్శనం, విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో ప్రతిబ కనబరిచే క్రమంలో పాఠశాల ప్రధానోపాదా య్యయులు నామా నాయక్, ఉపాధా య్యయ సిబ్బంది చేస్తున్న కృషి పట్ల పలు వురు అబినందనలు తెలుపుతున్నారు. సెప్టెంబర్ నెలలో జిల్లా స్తాయి క్రీడోత్సవాలకు సంబందించి క్రీడాకారుల ఎంపిక కూడా ఈ ఆశ్రమ పాఠశాల క్రీడాస్థలంలోనే నిర్వహించటం విశేషం. ప్రధా నంగా పాఠశాల ఆవరణ ముందు బాగంలో గార్డెన్ ఏర్పాటుచేయడంతోపాటు పిల్లలు సాయంత్రం సమయంలో సేద తీరటానికి కల్పించిన ఆకుపచ్చని వాతావరణం అధ్యాపక సిబ్బంది చేస్తున్న ప్రయత్నానికి పలితంగా కనిపిస్తోంది. పాఠశాల పరిశుభ్రతతో పాటు పదో తరగతిలోసైతం ఉత్తమ ఫలితాలను సాధించ టంలో ఐటిడిఎ పివో సైతం ప్రశంసించారు.

## ప్రమాదకరంగా గేటు వాల్ గుంత-పనిచేయని బోరుతో విద్యార్థుల ఇక్కట్లు

*కారేపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త*

అంగన్వాడీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు గ్రామానికి మంచినీరు సరపరా చేసే పైపులైను సంబందించి గేటు వాల్ ఏర్పాటు చేసినా పై మూత పెట్టకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోని పంచాయతీ పనితీరుకు నిదర్శనం. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సింగరేణి మండలం మంగలితండాలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్వాడీ కేంద్రం ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల గేటు ముందే గేట్‌వాల్‌కు సంబందించి పై మూత





ఏర్పాటుచేయకపోవడంతో చిన్నారులకు ప్రమాదకరంగా మారింది. దీనికి సంబందించి గ్రామ పంచాయతీ చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా పాఠశాలలో రెండు నెలల నుండి బోరు మరమ్మత్తులు చేయకపోవడంతో విద్యార్థులకు నీటికి ఇబ్బందికరంగా మారింది. బోరుకు సంబందించిన మరమ్మత్తులు చేయాలని పంచాయతీకి తెలిపినా చర్యలు తీసుకోలేదని సంబందిత టీచర్ తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ ప్రమాదం జరగకుండా ముందస్తుచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కోతుల దాడితో పత్తి రైతులకు తీవ్ర నష్టం:రాంబాబు

*వైరా,నవంబర్04,ప్రభాతవార్త:*

మధిర మండలం ఖమ్మంపాడు గ్రామపంచాయతీ పరిధిలో వడిత్య హరి కౌలు రైతు పత్తి పంటలు రైతు సంఘం కార్యదర్శి బొంతు రాంబాబు బృందం పరిశీలించింది. ఆరుకాలం కష్టపడి పనిచేసిన పంట పొలం కోతుల వలన నష్టపోవడంతో తీవ్ర మనోవేదనకు గురి చేసిందని కౌలు రైతు వడిత్య హరి



అన్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోతుల నిర్మూలనకు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులు, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవాలని, మద్దతు ధర రూ.12వేలు కల్పించి సిసిఐ ద్వారా కొనుగోలు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మందా సైదులు, ఒట్ల శంకర్‌రావు, పల్లికంటి విల్సన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.




## పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ మందులు పంపిణీ



*వైరా,నవంబర్04,ప్రభాతవార్త:*

వైరా మున్సిపాలిటీ పరిధిలోని గోజాతి పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ మందుల టీకాల కార్యక్రమాన్ని పశువైద్యాధికారి ఆధ్వర్యంలో స్థానిక వైష్ణవి డైరీ నందు వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ వ్యాధి పశువులకు సోకకుండా ముందు జాగ్రత్తగా పశువుల చర్మంపై గోమార్లు, పిడుదులు, పేలు రాకుండా ఎప్పటికప్పుడు పశువులు శుభ్రంగా ఉంచుకోవాలని, ఈ వ్యాధి సోకిన పశువులు పాలు వేడి చేసి మాత్రమే త్రాగవలెనని, ఈ వ్యాధి వలన మనుషులకు ఎలాంటి హాని జరగదని, రైతులకు సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి మేనేజర్ సతీష్, పశువైద్య సిబ్బంది కె.ప్రకాష్‌బాబు, రాకేష్‌రెడ్డి, గోపాలమిత్రలు బొడ్డు కృష్ణయ్య, రాకేష్‌రెడ్డి, గోపాలమిత్రలు బొడ్డు కృష్ణయ్య, ఈ.ప్రభాకర్, షేక్ ఖాసిం, డి.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ అందజేత



*వైరా,నవంబర్04,ప్రభాతవార్త:*

వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొల్లా రాంబాబు, నాగమణి దంపతుల కుమార్తె కొల్లా సాయి శరణ్య పుట్టినరోజు సందర్భంగా నిరుపేద మహిళలకు కుట్టుమిషన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతోజు నాగేశ్వరరావు, జిల్లా కమ్యూనిటీ సర్వీసెస్ నంబూరు మధు, జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, జిఎంటి కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, సభ్యులు అబ్బూరి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేందర్‌రావు, మిట్టపల్లి నాగి, కొణతాలపల్లి సుబ్బారావు, ఏపూరి రాజారావు, మిట్టపల్లి సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమస్యలు తాళలేక యువకుడు ఆత్మహత్య

*వైరా,నవంబర్04,ప్రభాతవార్త:*



వైరా మండలం పుణ్యపురం గ్రామంలో కుటుంబ సమస్యలు తాళలేక వాకదాని శ్రీకాంంత్(25) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మృతునికి భార్య స్వాతి ఉంది.

# నిరుపేద విద్యార్థులకు అండగా కాటేపల్లి మిత్ర బృందం



*కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త*

మేజర్ గ్రామపంచాయితి పరిధిలో శాంతినగర్‌కు చెందిన కంటిపూడి శ్రీహర్ష, ఖమ్మంపాటి రాజేశ్వరి నిరుపేద విద్యార్థులు జెఈఈ మెయిన్ అడ్వాన్స్‌లో క్వాలిపై జాతీయ స్థాయిలో మంచి ర్యాంక్‌లు సాధించి నీట్‌లో సీట్లు సాధించటం పట్ల విద్యార్థులను ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కాటేపల్లి కిరణ్‌కుమార్, తన చిన్ననాటి స్నేహితులు (శాంతినికేతన్ ఆరవ తరగతి బృందం) ఈ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కొరకై ఆర్థిక సహాయం చేసి వారి ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. విద్యకు పేదరికం అడ్డుకారాదని, విద్యార్థులకు రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీహర్షకు మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా ఈ పేద విద్యార్థులకు అండగా ఉంటామని కాటేపల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దారా సురేష్, గాంధీ, మోటమర్రి శ్రీనివాసరావు, షముల్ల, రామకృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యాన్ని చాటిన ముస్లిం కుటుంబం



*తల్లాడ, ప్రభాతవార్త, నవంబర్ 4*

అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం భిక్ష, రాత్రి అల్పాహారం ఏర్పాటుచేసి కుర్నవల్లికి చెందిన ముస్లిం కుటుంబం అన్ని మతాలు ఒక్కటేనని మతసామరస్యం చాటారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కుర్నవల్లిలో మతాలకు అతీతంగా షేక్ బాజీ అనే వ్యక్తి 30 మంది అయ్యప ్ప మాలాధారులకు మధ్యాహ్నం బిక్ష, రాత్రి అల్పాహారం స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా మాలాదారులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం కుర్నవల్లి అయ ్యప్ప ఆలయంలో మాలాదారులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు అన్నం కోటారెడ్డి, ఐలూరి భిక్షం రెడ్డి, గూడూరు శ్రీనివాసరెడి పాల్గొన్నారు.

## 5న కల్లూరులో జరిగే యాదవ కురుమ మహాసభకు రండి



*తల్లాడ, ప్రభాతవార్త, నవంబర్ 4*

గొర్రెల పంపిణీలో నగదు బదిలీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని s ఈనెల 5న కల్లూరులోని చంద్రుపట్ల రోడ రమణయ్య మామిడిలో యాదవ కురుమ మహాసభ జరుపుతున్నామని, దీనికి గొర్రెల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన దూదిమెట్ల బాలరాజు యాదవ్, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణ యాదవ్‌లు హాజరవుతున్నారని నిర్వాహకులు చెప్పారు. యాదవ కురుమలంతా అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకం దారుల సంఘ జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు యాదవ్, యాదం సంఘ మాజీ అధ్యక్షులు గుమ్మా వలరాజు యాదవ్, జిల్లా నాయకులు పంపాద్రి యాదవ్, యాదవ సంఘ మండల అధ్యక్షులు రాచబంటి పాపారావు, మండల నాయకులు వాకదాని రామకృష్ణయాదవ్, చిర్రా లింగయ్య యాదవ్, దేగల సురేష్ యాదవ్, ఎనిక గణేష్ యాదవ్ పాల్గొన్నారు.



## ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ సూపరిండెంట్ ఇంజనీర్‌గా అప్పలనాయుడు

*కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త*



కల్లూరు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటి సూపరిండెంట్ ఇంజనీర్‌గా బి. అప్పల నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జగిత్యాల చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిప్యూటి ఇంజనీర్‌గా పనిచేసి, బదిలీపై కల్లూరుకు వచ్చారు. ఇది వరకు ఈయన ఇరిగేషన్ డివిజన్ నెంబర్ 4 కల్లూరులో కార్యనిర్వాహక ఇంజనీర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడును కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ నీలాద్రీశ్వరునికి అన్నాభిషేకం



*పెనుబల్లి, నవంబర్ 04, ప్రభాతవార్త*

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నీలాద్రీలో గల శ్రీ నీలాద్రీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ నీలాద్రీశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

## పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన హైకోర్టు అడ్వకేట్ హరిబాబు



*తల్లాడ, ప్రభాతవార్త, నవంబర్ 4*

తల్లాడ సమీపంలోని కొత్తగూడెం రోడ్డులో నూతనంగా నిర్మించిన కార్తిక్ పిలి ్లంగ్ స్టేషన్ పెట్రోల్ బంకును ప్రముఖ హైకోర్టు అడ్వకేట్ ఈ. హరిబాబు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఆయనతో పాటు తల్లాడ ఎస్ఐ పి సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వారిని నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కామిశెట్టి వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి, సిరిచందన, కార్తీక , ఎంపిటిసి దగ్గుల రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు పొట్టేటి బ్రహ్మరెడ్డి, గుంటుపల్లి వెంకటయ్య, అద్దంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## హెచ్ఐవిపై అవగాహన సదస్సు



*కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త*

చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలోని యువతకు, గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌పి శివయ్య మాట్లాడుతూ కరోనా మహమ్మారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని వివరించారు. హెచ్ఐవి అనేది నాలుగు రకాలుగా వ్యాప్తి చెందుతుందని, హెచ్ఐవి సోకిన వ్యక్తి యొక్క రక్తం పరీక్షించకుండా ఇతరులకు ఎక్కించడం ద్వారా, తల్లి నుండి బిడ్డకు కలుషితమైన సూదులు, సిరంజుల ద్వారా, అసురక్సీత లైంగిక సంబంధాల వలన హెచ్ఐవి వ్యాప్తి చెందుతుందన్నారు. అదే విధంగా కండోమ్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిరోషా, లింక్ వర్కర్ అనిల్‌కుమార్, గ్రామంలోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీట్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థులకు సన్మానం



*కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త*

కల్లూరులో నీట్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థులకు తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించి, ఆర్థిక చేయూత నిచ్చారు. భవిష్యత్తులో మరింత రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండి ఫౌండేషన్ అధినేత సాధిఖ్ అలీ, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉస్మానియాలో డాక్టర్ సీట్లు సాధించిన ఆణిముత్యాలు

*కల్లూరు, నవంబర్ 04, ప్రభాతవార్త*





నీట్ ఫలితాల్లో కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీవీ ఆర్టిస్ట్ కుమార్తె బైర్ల అంజలి, పారా కొండ లరావు కుమారుడు పారా శ్రీహర్షలు అత్యధిక మార్కులు సాధించి, ఉస్మానియాలో డాక్టర్ సీట్లు సంపాదించారు. వీరు నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత స్థాయిలో ఎదిగినందుకు అంబేద్కర్ నగర వాసులు, మండల ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు. తల్లిదండ్రుల కృషి ఫలితమే వీరి భవిష్యత్తుకు మార్గదర్శకాలు అయ్యాయని గ్రామస్థులు అంటున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజిలో సీట్లు చాలా గొప్ప విషయం అని కొనియాడారు. అంబేద్కర్ నగర్‌లో ఉన్నత విద్యను అభ్యసించడంలో వారికి వారే సాటి.

# ఒంగోలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసుకోండి: కందాళ

## -ఎడ్ల పందెపు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కందాళ



*నేలకొండపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త:*
తెలంగాణా ప్రాంతంలో ఒంగోలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. పశు సంపదతో పాటు పాడి పరిశ్రమను కూడా అభివృద్ధి చేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాజేశ్వరపురం గ్రామం నందు జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పందెపు పోటీలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా పాలేరు శాసనసభ్యుడు కందాళ ఉపేందరరెడ్డి తన తల్లిదండ్రులు కందాళ నర్సింహారెడ్డి, మోహినిదేవి జ్ఞాపకార్థం రూ.4లక్షలు ఎద్దుల పందేల పోటీల నిర్వాహణ కమిటికి అందచేసారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, జెడ్పి వైస్‌చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, నేలకొండపల్లి ఎంపిపి వజ్జా రమ్య, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నంబూరి శాంత, సిడిసి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాదు, పైనంపల్లి పిఏసిఎస్ చైర్మన్, డిసిఎంఎస్ డైరక్టర్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, రాజేశ్వరపురం ఎంపిటిసి మెంబర్ జటంగి చంద్రమ్మ, నేలకొండపల్లి పిఏసిఎస్ చైర్మన్ కోటి సైదారెడ్డి, రాజేశ్వరపురం గ్రామ పిఏసిఎస్ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, మండల టిఆర్ఎస్ నాయకులు వజ్జా శ్రీనివాసరావు, మరికంటి రేణుబాబు, నంబూరి సత్యనారాయణ, జటంగి వెంకన్న, దండా రంగయ్య, బోనగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎటూ తేలని చెక్ పవర్ మార్పిడి

**సర్పంచ్ సభకు రావాలంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్తులు- వాయిదా పడ్డ సువర్ణాపురం గ్రామ సభ- ప్రారంభించకుండానే వాయిదా..**
**-సభ నుంచి పలాయనం చిత్తగించిన సర్పంచ్- సభ నుంచి సర్పంచ్‌ని లాక్కెళ్ళిన భర్త-సర్పంచ్ పై గ్రామ ప్రజలు ఫిర్యాదు**

## సర్పంచ్ చెబితేనే సభ పెట్టామంటున్న అధికారులు

*ముదిగొండ, నవంబర్ 4, ప్రభాతవార్త :*
మండల పరిధిలోనే సువర్ణాపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ పంచాయితీలో ఆది నుండి సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య గ్రామంలో ఆదిపత్యపోరు కొనసాగుతున్న విషయం విషయం విధితమే గ్రామ సభకు గ్రామంలోనే పంచాయితీ పాలకవర్గంతో పాటు, మహిళలు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. గ్రామ సర్పంచ్ కొట్టే అరుణ మాట్లాడుతూ.... గ్రామ సభను వాయిదా వేసామని చెప్పటంతో గ్రామస్తులు పాలకవర్గ సభ్యులు అవాక్కయ్యారు. ఉప సర్పంచ్ చెక్ పవర్ అంశం ఎటు తేలకుండానే గ్రామ సభ వాయిదా పడింది. సువర్ణపురం ఉప సర్పంచ్ తోట ధర్మారావు చెక్కులపై సంతకాలు చేయకుండా గ్రామాభివృద్ధికి అడుడ్డుడుతున్నాడని జాయింట్ చెక్ పవర్‌ని ఉప సర్పంచ్ ధర్మారావు నుంచి వేరొకరికి బదిలీ చేయాలని సర్పంచ్ కొట్టే అపర్ణ మండల పంచాయితీ అధికారి పి సూర్య నారాయణకు ఇటీవల కాలంలో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై గ్రామసభ నిర్వహించాలని గ్రామ కార్యదర్శి బుర్రా హరీష్‌కు ఎంపీవో ఆదేశించారు. దీంతో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు భారీగా గ్రామ



పంచాయితీ కార్యాలయం చేరుకున్నారు. ఉదయం 10.30 నిమిషాలకు సభా ప్రారంభం కాగా పంచాఇయతీ కార్యదర్శి సభకు అధ్యక్షత వహించమని సర్పంచ్ కొట్టే అపర్ణకు మైకు ఇచ్చారు. ఏమి జరిగిందో ఏమో గాని చెక్ పవర్ మార్పిడి అంశంపై చర్చ జరగకుండానే ఒక మాటతోనే సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అక్కడ నుంచి సర్పంచ్ పలాయనం చిత్తగించడం ఆశ్చర్యానికి గురి చేసింది. చెక్ పవర్ మార్చాలని ఫిర్యాదు చేసిన సర్పంచ్ సభను వాయిదా వేయడంతో అక్కడ ఉన్న గ్రామ ప్రజలకు ఏమి అర్థం కాక కాసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ అడిగితే సర్పంచ్ ఇష్టం మేరకు గ్రామ సభను ఏర్పాటు చేయడం జరిగిందని వారి ఇష్టం ప్రకారమే వాయిదా వేయడం జరిగిందని మాకు ఏమి తెలియదని అనడంతో ప్రజలు వాగ్వాదానికి దిగారు. మేము పనులు మానుకొని ఉదయం నుంచి ఇక్కడ ఉంటే సభను వాయిదా వేస్తున్నామని చెప్పడం ఏంటని, ఇది మమ్మల్ని అవమానపరిచే విధంగా ఉందని గ్రామ ప్రజలు వాపోయారు. కాగా సర్పంచ్ మాట్లాడుతుండగానే ఆమె భర్త వచ్చి సభ నుంచి సర్పంచ్‌ని లాక్కెళడం చర్చనీయాంశమైనది. గ్రామసభ జరిగితే తమ అభిప్రాయాలను వ్యక్తపరుద్దామని ఉన్న గ్రామ ప్రజలకు వాయిదా వేశారని చెప్పడంతో తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. మీ



ఇష్టం వచ్చినట్లుగా చేస్తారా అని అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. సర్పంచ్ సభ నుంచి వెళ్ళిపోవడంతో గ్రామస్తులు సర్పంచ్ రావాలం టూ సభను నిర్వహించాలని నినాదాలు చేశారు. సర్పంచ్ కొట్టే అపర్ణ పని విధానంపై విసుగెత్తిపోయామని సర్పంచ్ తమకు వద్దంటూ గ్రామ ప్రజలు మండల పంచాయితీరాజ్, అధికారు లకు ఫిర్యాదు చేశారు. కాగా సువర్ణాపురంలో అటకెక్కిన గ్రామ అభివృద్ధి సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య ఆదిపత్య పోరు ముదరటంతో గ్రామ ప్రజలు వారి మధ్య సమస్యలతో కూనరిల్లుతున్నారు. నాలుగేళ్ళుగా గ్రామ పంచాయితీ నిధులు వృదా అవుతన్నాయి.

# శివాలయంలో సామూహిక లక్ష్మీపూజ

*గూడూరు, నవంబర్ 4, ప్రభాతవార్త*
పవిత్ర కార్తీక మాసోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక సనాతన శివాలయంలో సామూహిక లక్ష్మీదేవి కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా ప్రకటించిన విధంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ సమూహిక కుంకుమ పూజలో స్థానిక మహిళా భక్తులు పలువురు పాల్గొని అమ్మవారికి పూజలు జరిపారు. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి నిత్యం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన కుంకుమ పూజ అనంతరం ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం యదావిధిగా ఆకాశ దీపావిష్కరణ, పంచహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలో ఆలయ కమిటి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.






## బహుముఖ ప్రజ్ఞాశాలి శాస్త్రవేత్త శకుంతలాదేవి



*నేలకొండపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త:*
ప్రముఖ గణిత, ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త శకుంతలాదేవి బహుముఖ ప్రజ్ఞాశాలి అని నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సపాల్ డాక్టర్ ఆలేటి పంజ్యోతి వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లిలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల నందు గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గణిత, ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతిని ఘనంగా నిర్వహించారు. శాత్రవేత్త శకుంతలాదేవి చిత్రపటంకు కళాశాల ప్రిన్స్‌పాల్ ఆలేటి పరంజ్యోతి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ ఎన్.మాధవరావు, గణితశాస్త్ర అధ్యాపకులు కే.శ్రీనివాస్, అధ్యాపకులు జానకిరామారావు, సిహెచ్.శ్రీనివాస్, మాధవి, కోటమ్మ, కవిత, అనిత, ఎస్ఎం రఫీ, డాక్టర్ ఆర్.వెంకట్రాజం, వాణి, కోటేశ్వరరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్మరణ సభను జయప్రదం చేయండి



*తిరుమలాయపాలెం,నవంబర్ 4, ప్రభాతవార్త :*
భూమి కోసం, భుకినత కోసం పేద ప్రజల విముక్తి కోసం విప్లవోద్యమ పోరాటంలో పాల్గొని అనేక మంది అమలరులయ్యారని సీపీఐ ఎంఎల్ ఎన్డీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడు, పిండిప్రోలు గ్రామాల్లో ఈ నెల 5న దమ్మాయిగూడెంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెత్తందారి భూస్వామ్య విధానానికి, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించి విలువైన ప్రాణాలను పణంగా పెట్టి మహానీయులు పోరాడారన్నారు. ప్రరజల కోసం జీవితాలను అంకితం చేసిన అమరవీరుల సంస్మరణ ప్రజలు, ప్రజాస్వామ్యదులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఎన్డీ సీనియర్ నాయకులు పుసులూరి సైదయ్యను పరామిర్శంచారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గొర్రెపాటి రమేషన, ఉప్పలయ్య, పేరం వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, షబ్బీర్, బొమ్మగాని వెంకన్నర, ఎల్లయ్య, నాగేశ్వరరావు, శ్రీను, రమేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థి మృతి

*ముదిగొండ,నవంబర్ 4, ప్రభాతవార్త :*
మండల పరిధిలోని బాణాపురం గ్రామంలో చలువాది పల్లవి (15) అనారోగ్యంతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఫుడ్ పాయిజన్ అయినందున గత 3రోజుల నుండి ఖమ్మంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేసిన స్పందించకపోవడంతో గురువారం హైదరాబాదులోని ఒక ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. శుక్రవారం చికిత్స చేస్తుండగానే ఉదయం 11.30గంటల సమయంలో మృతి చెందిందని చిన్న వయస్సులోనే పల్లవి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శ్లోకసముద్రంలో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

